# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 6 ఏప్రిల్ 2026 | సంపుటి: 22 | సంచిక: 189 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## ఆఖరి ఓవర్ వరకు పోరాడి ఓడిన సన్‌రైజర్స్

### ఉత్కంఠ పోరులో లక్నో విజయం



సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వీరోచితంగా పోరాడినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ రిషభ్ పంత్ (68 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో లక్నోను గెలిపించాడు. - నినాదం, స్పోర్ట్స్

2

# హైకోర్టు జోన్-II భవన నిర్మాణానికి శంకుస్థాపన

## వందేళ్లు నిలిచేలా హైకోర్టు నిర్మాణం

### సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా శంకుస్థాపన

ప్రభుత్వానికి సీజేఐ అభినందనలు

కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్, హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్



తెలంగాణ హైకోర్టు జోన్ 2 బుద్వేల్ శంకుస్థాపన, జస్టిస్ సూర్యకాంత్ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనగా, ఆధునిక న్యాయసదుపాయాలతో అతిపెద్ద సముదాయం లక్ష్యంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణ న్యాయవ్యవస్థ చరిత్రలో ఆదివారం మరో ముఖ్యమైన మైలురాయి నమోదైంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్‌లో నిర్మించనున్న హైకోర్టు జోన్–II భవనానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. 2

- హైదరాబాద్ (నినాదం)

## హైకోర్టు సముదాయం ప్రతి వర్గానికి ఒక దేవాలయం

### సీఎం రేవంత్

హైకోర్టు సముదాయం ప్రతి వర్గానికీ ఒక దేవాలయం లాంటిదని, అలాంటి కీలక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం దక్కడం తనకు గర్వకారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయ జీవితంలో ఇలాంటి సందర్భాలు చాలా అరుదుగా వస్తాయని, ఈ అవకాశం తనకు లభించడం ఆనందంగా ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో హైకోర్టు జోన్–2 భవన నిర్మాణానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు మరియు తెలంగాణ హైకోర్టుకు చెందిన పలువురు న్యాయమూర్తులు, అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుత హైకోర్టు భవనం అవసరాలకు సరిపోవడం లేదని, అంతేకాక అది వారసత్వ కట్టడంగా ఉన్నందున చరిత్రను కాపాడుకుంటూనే కొత్త సముదాయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు.



## ఖానాపూర్ మున్సిపాలిటీ బీజేపీ కైవసం

### బీఆర్ఎస్ సపోర్ట్‌తో ఛైర్మన్ పదవి

**మున్సిపల్ ఛైర్మన్‌గా అంకం మౌనిక, వైస్ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి మహమ్మద్ షోయబ్**

**ఎన్నికల అధికారి ప్రకటన**

**ఖానాపూర్, (నినాదం)**

గత కొన్ని రోజులుగా ఉత్కంఠగా మారిన ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు ముగిసింది. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో బీజేపీ ఖానాపూర్ మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. బీఆర్ఎస్, బీజేపీ చెరో 4 నాలుగు స్థానాల్లో గెలవగా.. కాంగ్రెస్ 3, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. అయితే కాంగ్రెస్ పార్టీకి ఇండిపెండెంట్, ఎక్స్ అఫీషియో మద్దతు తెలపగా.. బీజేపీ, బీఆర్ఎస్ కలిపి ఛైర్ పర్సన్ పదవిని దక్కించుకున్నాయి. రాష్ట్రంలో ఫిబ్రవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కొన్ని పురపాలికల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ ...మిగతా 2లో



## ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి

### అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ

- పాలనా సౌలభ్యం, గిరిజనుల సమస్యల పరిష్కారానికి నిర్ణయం
- ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనం బిల్లు పెట్టాలని అభ్యర్థన

**హైదరాబాద్ ఏప్రిల్ 5 (నినాదం)**

భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పాలనా సౌలభ్యం, స్థానిక గిరిజనుల సమస్యల పరిష్కారం ...మిగతా 2లో

## యూడీఎఫ్ సర్కార్ వస్తే.. కేరళంలో భూభారతి అమలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్

కేరళంలో యూడిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే ప్రజలకు ఇచ్చే ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

-త్రివేండ్రం, ఏప్రిల్ 5 (నినాదం)



మావేలిక్కర అసెంబ్లీ నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి ముతర రాజ్‌కు మద్దతుగా ఆదివారం నాడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీలను పారదర్శకంగా, ...మిగతా 2లో



## క్రీడల్లో దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలుపుతాం

### 'ఆల్ ఇండియా పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్' ముగింపు వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్ 5 (నినాదం)**

భాగ్యనగరం ఒకప్పుడు భారత ఫుట్‌బాల్‌కు వెన్నెముకగా నిలిచిందని, ఆ పూర్వవైభవాన్ని తిరిగి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ...మిగతా 2లో



## హోర్ముజ్ జలసంధిని తక్షణమే తెరవండి

2

### లేదంటే పవర్ ప్లాంట్లపై దాడులు చేస్తాం: ట్రంప్

న్యూఢిల్లీ (నినాదం): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై బూతులతో రెచ్చిపోయారు. తాను ఎంతగా హెచ్చరించినా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవకపోవడంతో ట్రంప్ తీవ్ర ఆవేశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు.



## రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న విమానాన్ని కూల్చేశాం

- ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడి
- ఇరాన్ నుంచి ఎఫ్ 15 పైలట్‌ను కాపాడాం
- ఒక్క అమెరికా సైనికుడినీ యుద్ధభూమిలో విడవం: ట్రంప్

2



## మరోసారి డ్రగ్స్ పార్టీ కలకలం

### ఆరుగురికి పాజిటివ్

- గోల్కొండలోని తారామతి బారాదరి రిసార్టులో రాత్రి ఈగల్ టీం తనిఖీలు
- 36 మందికి డ్రగ్స్ కిట్లతో పరీక్షలు జరిపిన పోలీసులు

2

## పార్టీ మార్పు ప్రచారాలపై ఈటల ఆగ్రహం

### పార్టీ మారడం బట్టలు మార్చుకున్నంత సులభం కాదు

**హైడ్రా కూల్చివేతలపై ధ్వజం**



**హైదరాబాద్ ఏప్రిల్ 5 (నినాదం)**

మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీని వీడి ఇతర పార్టీలోకి చేరుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రచారాంపై ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ.. ఆ వార్తలను కొట్టిపారేశారు. ఆదివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనపై జరుగుతున్నవి 'పిచ్చి ప్రచారాలు' అని మండిపడ్డారు. తాను, మాజీ ఎమ్మెల్యే ...మిగతా 2లో

## నాదర్‌గుల్ భూముల్లో రూ.7 వేల కోట్ల కుంభకోణం

### దళితుల భూములను దోచుకుంటోన్న కాంగ్రెస్ ప్రభుత్వం

హరీశ్ రావు సంచలన ఆరోపణలు



**హైదరాబాద్ ఏప్రిల్ 5 (నినాదం)**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులు, బలహీన వర్గాల భూములను అధికార పార్టీ పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఒకవైపు పారిశ్రామికవేత్తల ముసుగులో, మరోవైపు కబ్జాల రూపంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక భూ కుంభకోణాలకు పాల్పడుతోందన్నారు. నాదర్‌గుల్‌లోని సర్వే నంబర్ 613 (కొత్త సర్వే నంబర్ 119) లో ఉన్న 373 ఎకరాల భూమిలో 7 వేల కోట్ల రూపాయల భారీ స్కాం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దలు, మంత్రులు ఉన్నారని రక్షకులే భక్షకులుగా మారారని ధ్వజమెత్తారు. నాదర్‌గుల్ భూములను ప్రభుత్వ భూములుగా ...మిగతా 2లో



## హిమంత క్షమాపణలు కోరినా చర్యలు తప్పవు

- మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

2

## నీటి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

### ప్రకటించిన ఏపీ సీఎం చంద్రబాబు

- ఏప్రిల్ 6 నుంచి జులై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం
- 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు కీలక బాధ్యతలు
- అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం
- ప్రజల భాగస్వామ్యంతో కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే ధ్యేయం

2



## బాబూ జగ్జీవన్ రామ్‌కు చంద్రబాబు ఘన నివాళి

అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన సేవలు అమోఘం విద్యార్థి దశ నుంచే అంటరానితనంపై పోరాడిన సంస్కర్త అని వ్యాఖ్య



## గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు మరిన్ని విమాన సర్వీసులు

2

న్యూఢిల్లీ (నినాదం): గల్ఫ్ ప్రాంతం నుంచి భారత్‌కు విమాన సర్వీసుల పరిస్థితి మెరుగుపడుతోంది. ఆదివారం ఒక్కరోజే యూఏఈ నుంచి 90 ప్రత్యేక విమానాలు భారత్‌కు చేరుకోనున్నాయని అధికారిక ప్రకటన వెల్లడించింది. సౌదీ అరేబియా, ఒమన్ నుంచి కూడా విమానాలు నడుస్తున్నాయి. ఖతార్ గగనతలం పాక్షికంగా తెరుచుకోవడంతో, అక్కడి నుంచి 8 నుంచి 10 విమానాలు వచ్చే అవకాశం ఉంది.

# హైకోర్టు జోన్-II భవన నిర్మాణానికి శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు, హైకోర్టుకు చెందిన పలువురు న్యాయమూర్తులు హాజరయ్యారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ కొత్త ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో కోర్టు గదులు, డిజిటల్ లైబ్రరీలు, పరిపాలనా విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు రెండో దశలో న్యాయమూర్తుల నివాస గృహాలను కూడా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న హైకోర్టు భవనం వారసత్వ కట్టడం కావడంతో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బుద్వేల్‌లో ఈ ఆధునిక కాంప్లెక్స్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమవుతున్న ఈ జోన్–II భవనం ద్వారా న్యాయ సేవలు మరింత వేగవంతం



అవుతాయని అధికారులు తెలిపారు.

**న్యాయవ్యవస్థ బలోపేతానికి దోహదం:**

ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, తెలంగాణలో పెరుగుతున్న జనాభా మరియు న్యాయ అవసరాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయస్థానాలకు అవసరమైన భవనాలు, సాంకేతిక వనరులు అందుబాటులోకి రావడం ద్వారా సాధారణ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందుతుందని చెప్పారు. కొత్త హైకోర్టు ప్రాంగణం కోసం విలువైన భూమిని కేటాయించి, నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఆయన ప్రశంసించారు.

సంబంధిత వార్తలు

## ఖానాపూర్ మున్సిపాలిటీ బీజేపీ కైవసం

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలోనే హైకోర్టు ఆదేశాలతో వాయిదా పడిన క్యాతన్‌పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్ మున్సిపాలిటీ ల్లో చైర్మన్ ఎన్నికలు నిర్వహించగా.. ఖానాపూర్‌లో తీవ్ర ఉద్రిక్తతల నడుమ మరోసారి ఇవాల్టికి ఎన్నిక ప్రక్రియ వాయిదా పడింది. ఈ క్రమంలోనే ఎట్టకేలకు ఇవాళ ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా.. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో బీజేపీ పార్టీ గెలుచుకుంది. ఛైర్ పర్సన్‌గా బీజేపీకి చెందిన అంకం మౌనిక, వైస్ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సోయల్ ఎన్నికయ్యారు. ఖానాపూర్ పురపాలక సంఘంలో మొత్తం 12 కౌన్సిలర్ స్థానాలు ఉండగా.. అందులో బీఆర్ఎస్ పార్టీ 4.. బీజేపీ 4.. కాంగ్రెస్ పార్టీ 3.. స్వతంత్రులు ఒక స్థానంలో గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీకి స్వతంత్ర అభ్యర్థి మద్దతు తెలపడంతో పాటు.. ఎక్స్ అఫీషియో సభ్యుడి ఓటుతో.. ఆ పార్టీకి బలం ఐదుకు చేరింది. ఈ నేపథ్యంలోనే ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ లభించలేదు. ఈ క్రమంలోనే బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించడంతో.. ఈ రెండు పార్టీల బలం 8కి చేరింది. దీంతో బీజేపీ తరఫున ఛైర్ పర్సన్ అభ్యర్థిగా ఉన్న అంకం మౌనికకు మద్దతుగా బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన ఏడుగురు అభ్యర్థులు సభ్యులు చేతులెత్తడంతో ఎన్నిక ముగిసింది. ఇక వైస్ ఛైర్ పర్సన్‌గా బీఆర్ఎస్ పార్టీ తరఫున బరిలో నిలిచిన మహ్మద్ సోయల్ విజయం సాధించారు.

## ఆఖరి ఓవర్ వరకు పోరాడి ఓడిన సన్‌రైజర్స్

157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు మంచి ఆరంభం లభించింది. ఎయిడెన్ మార్క్రమ్ (45) వేగంగా ఆడాడు. అయితే, సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో మధ్యలో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురైంది. కానీ, ఒకవైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ రిషభ్ పంత్ చివరి వరకు క్రీజులో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. 50 బంతుల్లో 9 ఫోర్లతో 68 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆఖరి ఓవర్ లో లక్నో విజయానికి 9 పరుగులు కావాల్సి ఉండగా... పంత్ రెండు ఫోర్లు కొట్టడంతో స్కోరు సమం అయింది. 4 బంతుల్లో 1 పరుగు కావాల్సి ఉండగా... ఉనద్కట్ రెండు డాట్ బాల్స్ విసరడంతో ఉత్కంఠ పెరిగిపోయింది. మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారితీస్తే బాగుండని సన్ రైజర్స్ అభిమానులు కోరుకున్నారు. అయితే, పంత్ మరో బౌండరీ కొట్టడంతో మ్యాచ్ సన్ రైజర్స్ చేజారింది. లక్నో 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్ష్ దూబే 2 వికెట్లు తీశాడు. అంతకుముందు, టాస్ గెలిచిన లక్నో బౌలింగ్ ఎంచుకుంది. మహమ్మద్ షమీ (2/9) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో సన్‌రైజర్స్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ట్రావిస్ హెడ్ (7), అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో, పవర్ ప్లే ముగిసేసరికి రైజర్స్ 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో కలిసిన హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 116 పరుగులు జోడించడంతో సన్‌రైజర్స్ కోలుకుంది. క్లాసెన్ 41 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 62 పరుగులు చేయగా, నితీశ్ రెడ్డి 33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 పరుగులు సాధించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది.

## మరోసారి డ్రగ్స్ పార్టీ కలకలం

హైదరాబాద్ ఏప్రిల్ 5 (నినాదం)

వీకెండ్‌లో హైదరాబాద్‌లో మరోసారి డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. గోల్కొండలోని తారామతి బారాదరి రిసార్టులో శనివారం అర్ధరాత్రి తెలంగాణ ఈగల్ టీం నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురికి డ్రగ్స్ పాజిటీవ్‌గా నిర్ధారణ అయింది. శనివారం రోజు తారామతి బారామతి రిసార్టులో 'మోర్ దెన్ ఫ్రెండ్స్' పేరుతో ఓ ప్రైవేట్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చంద్ర అనే వ్యక్తి నిర్వహించినట్లు తెలిసింది. అయితే పర్యాటక ప్రచారంలో భాగంగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు వేడుకకు చివరి నిమిషంలో పోలీసులు అనుమతి పొందడానికి ప్రయత్నించారు. కాని వారి నుంచి అనుమతి రాలేదు. అయినప్పటికి కూడా ఈవెంట్ ప్రారంభించారు.

డ్రగ్ పరీక్షలో ఆరుగురికి పాజిటివ్ : ఈ పార్టీకి కేవలం మద్యం సేవించడానికి మాత్రమే ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్నారు. ఈ ఈవెంట్‌కి దాదాపు 200 మందికి పైగా హాజరయ్యారు. ఈ వేడుకలో కొందరు వ్యక్తులు డ్రగ్స్ సేవిస్తున్నారని తెలంగాణ ఈగల్ టీమ్‌కు సమాచారం అందింది. డ్రగ్స్ వినియోగదారుల సస్పెక్ట్ షీట్‌లో ఉన్న వ్యక్తులు ఈ పార్టీకి హాజరయ్యారనే సమాచారంతో ఈగల్ టీమ్ డీఎస్పీ భిక్షపతి, స్థానిక గోల్కొండ పోలీసుల సహాయంతో రాత్రి 10 గంటల సమయంలో ఆకస్మిక దాడి నిర్వహించారు.

ఎవరూ తప్పించుకునేందుకు అవకాశం లేకుండా చేసి అనుమానాస్పదంగా సుమారు 36 మందిని డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురికి పాజిటివ్ అని తేలింది. డ్రగ్స్ సేవించినట్లు నిర్ధారణైన వారిలో ఒక యువతి కూడా ఉన్నట్లు సమాచారం. పోలీసులు వీలందరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాజిటివ్ వచ్చిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. పరం సి నిహార్, ఆశి, అబ్దుల్ సర్వర్, యోగేశ్వర్, జాసన్ అనే వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను ప్రశ్నించిన తరువాత వారిని ఇవాళ న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## పార్టీ మార్పు ప్రచారాలపై ఈటల ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

బొడిగె శోభ పార్టీ మారుతున్నామన్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అలాగే "పార్టీ మారడం అంటే బట్టలు మార్చుకున్నంత సులభం కాదని..తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలకు మా పార్టీలోనే కొందరు ఊతమివ్వడం విచారకరకరమని అన్నారు. తాను పదవుల కోసం పద్దులు మోసే వ్యక్తిని కాదు" అని ఈటల ఘాటుగా స్పందించారు. కేసీఆర్ తనను పార్టీ నుంచి బయటకు నెట్టి ఐదేళ్లు అవుతోందని, ఆనాడు తన గోడు వినేవారే లేరని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత వస్తోందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా 'హైడ్రా' పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టడం అరాచకమని ధ్వజమెత్తారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై సుప్రీంకోర్టులో కేసు వేస్తామని వెల్లడించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఇప్పటికే రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వంపై త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు.

# నీటి సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

**అమరావతి, ఏప్రిల్ 5 (నినాదం):**

రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా నేడు రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, రాబోయే 100 రోజుల ప్రణాళికపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా, సీఎం చంద్రబాబు ఏప్రిల్ 6 తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. నీటి భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తూ వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. "ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి, ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి, భూగర్భ జలాలను పెంచాలి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇరిగేషన్, అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేసి సాగునీటి సంఘాలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నీటి భద్రతను సాధిస్తే మిగిలిన అన్ని రంగాల్లో అభివృద్ధి దానంతట అదే సాధ్యమవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ 100 రోజుల కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో అమలు చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను ప్రకటించింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రణాళికను రూపొందించారు.

ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 వరకు: చేపట్టాల్సిన పనుల గుర్తింపు.

ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 20 వరకు: గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతుల మంజూరు.

ఏప్రిల్ 21 నుంచి జూలై 9 వరకు: క్షేత్రస్థాయిలో పనుల అమలు.

జూలై 10 నుంచి జూలై 14 వరకు: పూర్తి చేసిన పనులపై నివేదికల సమర్పణ.

ఈ షెడ్యూల్ ప్రకారం 'మిషన్ అప్రోచ్'తో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సీఎం అధికారులకు, సాగునీటి సంఘాల సభ్యులకు సూచించారు.

**కరవు రహిత రాష్ట్రమే ధ్యేయం.. ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి**

కొద్దిపాటి శ్రద్ధ పెడితే రాష్ట్రంలో నీటి సమస్యను అధిగమించి, కరవు రహిత రాష్ట్రంగా మార్చవచ్చని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందని అన్నారని, కానీ నేడు హార్టికల్చర్ హబ్‌గా మారిందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీ–నీవా, గాలేరు–నగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులతో పాటు, నేడు పోలవరం సహా పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. గతేడాది (2024 మే నుంచి 2025 మే వరకు) ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు 2.20 మీటర్ల మేర పెరిగాయని, అంటే సుమారు 200 టీఎంసీల నీటిని అదనంగా భూమిలో ఇంకించగలిగామని తెలిపారు. అదే స్ఫూర్తితో ఈ 100 రోజుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో.. భూగర్భ జలాల పెంపే లక్ష్యం**

నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపులో అన్నమయ్య జిల్లా సాధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. 'జలధార' పేరుతో ఆ జిల్లాలో చేపట్టిన చర్యలు అద్భుత ఫలితాలనిచ్చాయని, స్థానిక జలవనరులను వినియోగించుకుని, చెరువులను నింపి భూగర్భ జలాలను గణనీయంగా పెంచారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 8.7 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలను, కనీసం 1.5 మీటర్ల మేర పైకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**పూడికతీత నుంచి వాటర్ బడ్జెట్ వరకు.. చేయాల్సిన పనులివే**

ఈ 100 రోజుల్లో చేపట్టాల్సిన పనులపై సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫీడర్ ఛానెళ్లను శుభ్రం చేయడం, చెరువులు, కాల్వల్లో పూడిక తీయడం, గుర్రపు డెక్కను తొలగించడం వంటి పనులను వెంటనే చేపట్టాలన్నారు. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, వరద ముంపును కూడా అరికట్టవచ్చని తెలిపారు. అవసరమైన చోట చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయడం, కొత్త నిర్మాణాలు చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా, ప్రతి సాగునీటి సంఘం తమ పరిధిలో 'వాటర్ బడ్జెట్' తయారు చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యత, అవసరాలపై స్పష్టమైన అంచనాతో ముందుకు సాగాలన్నారు. నీటి వృధాను అరికట్టేందుకు మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు.

## ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి

మొదటి పేజీ తరువాయి

కోసం ఈ విలీనం అత్యవసరమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్–తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. ఈ గ్రామాలను భద్రాచలంలో విలీనం చేయడం ద్వారా గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి, సానుకూలంగా స్పందించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు మరిన్ని విమాన సర్వీసులు

కువైట్, బహ్రెయిన్ దేశాల్లో గగనతలాలను మూసివేసినప్పటికీ, సౌదీ అరేబియాలోని దమ్మామ్ మీదుగా ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా, ఇజ్రాయెల్ నుంచి ఈజిప్ట్, జోర్డాన్ మీదుగా, ఇరాక్ నుంచి జోర్డాన్, సౌదీ అరేబియా మీదుగా భారతీయులను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇరాన్ నుంచి ప్రయాణాలను అర్మేనియా, అజర్‌బైజాన్ ద్వారా సులభతరం చేస్తున్నారు. ఇటీవల ఒమన్ తీరంలో నౌకపై జరిగిన దాడిలో మరణించిన భారత నావికుడి పార్థివదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చారు. ఆయన కుటుంబానికి అవసరమైన అన్ని సహాయాలను అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు, ఇరాన్‌లో చిక్కుకుపోయిన 345 మంది భారత జాలర్లు శనివారం సురక్షితంగా చెన్నైకి చేరుకున్నారు. గల్ఫ్, పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులను విదేశాంగ మంత్రిత్వ శాఖ నిశితంగా గమనిస్తోంది. భారతీయుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను, 24 గంటల హెల్ప్‌లైన్లను నిర్వహిస్తున్నారు. అక్కడి భారత రాయబార కార్యాలయాలు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థులు, నౌక సిబ్బందికి కూడా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

## హిమంత క్షమాపణలు కోరినా చర్యలు తప్పవు

హిమంత నేతృత్వంలోని బీజేపీ సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందని అన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని బీజేపీ ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా, ఆయనపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అసోం ప్రజల ప్రయోజనాల కంటే, కొన్ని కార్పొరేట్ గ్రూపుల లాభం కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాతో సహా కేంద్ర నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నారు. అసోం వనరులను పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తున్నారని ఆయన ఆరోపించారు. "ఢిల్లీలో కూర్చున్న ఆయన వ్యాపార భాగస్వాములు నరేంద్ర మోదీ, అమిత్ షా మిమ్మల్ని వారి వ్యక్తిగత ఏటీఎంలా మార్చేశారు. మీ భూమిని అంబానీ, అదానీ, బాబా రామ్‌దేవ్‌లకు అప్పగించారు. ఆయన ఈ భూమిని ఉచితంగా ఇవ్వరు. బదులుగా ఈ వ్యక్తులు ఆయనకు తమ మద్దతును అందిస్తున్నారు. ట్రంప్ ట్వీట్ పంపినప్పుడల్లా మోదీ వణికిపోతుంటారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

## నాదర్‌గుల్ భూముల్లో రూ.7 వేల కోట్ల కుంభకోణం

మొదటి పేజీ తరువాయి

డిక్లేర్ చేయాలని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు లేఖ రాయగా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2007లో వీటిని ప్రభుత్వ భూములుగా అసెంబ్లీలో ప్రకటించి APIIC కి అప్పగించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ప్రభుత్వం ఈ భూములను కంటికి రెప్పలా కాపాడితే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రేవంత్ రెడ్డి కన్ను ఈ భూములపై పడిందన్నారు. ఈ భూముల్లో 600 మంది పేద రైతులు తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటున్నారని ఈరోజు వాళ్లను భూముల్లోకి రానివ్వకుండా బౌన్సర్లను, రౌడీలను పెట్టి పోలీసుల చేత దాడులు చేయించి అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. కౌసల్య, మమత లాంటి మహిళా రైతులు 40 ఏళ్లుగా ఈ భూమినే నమ్ముకుని బతుకుతున్నారు. వారికి 5, 10 లక్షలు ఆశచూపి వెళ్లగొట్టాలని చూస్తున్నారు, బోర్లు, కంచెలు ధ్వంసం చేశారని ఆరోపించారు. మహిళలను రౌడీల చేత బెదిరిస్తున్నారు. పేదలకు సాయం చేయాల్సిన పోలీసులు పెద్దలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఈ నాదర్‌గుల్ భూములు తనవని శివరాజ్ బహదూర్ అనే వ్యక్తి నిజాం కాలం నాటి మాటలు చెబుతుండగా, 2005లోనే అప్పటి ఆర్డీవో ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారని 2017లో సుప్రీంకోర్టు కూడా ఇది ప్రభుత్వానిదేనని చెప్పిందన్నారు. రాష్ట్రంలో ఉన్న ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి 373 ఎకరాలు ఉండే అవకాశం లేదు. కానీ 2016లో శివరాజ్ బహదూర్ ఈ భూములను ఆల్ఫా, ఒమేగా, యునిటెక్ అనే కంపెనీలకు విక్రయించాడు. చట్టంలోని సెక్షన్ 8, సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా ఈ భూములను అమ్మే హక్కు ఎవరికీ లేదు. ఈ విక్రయాలు చెల్లవని, ఇది సెక్షన్ 22A కింద నిషేధిత జాబితాలో ఉంటుందని కందుకూరు ఆర్డీవో తేల్చిచెప్పారు. ఆర్డీవో నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సదరు కంపెనీలు హైకోర్టుకు వెళ్లగా.. ఆర్డీవో నిర్ణయమే సరైనదని, ఈ భూముల క్రయవిక్రయాలు చెల్లవని సింగిల్ బెంచ్ మరియు డివిజన్ బెంచ్ (13-10-2022న) స్పష్టం చేశాయన్నారు. అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూడా కోర్టు సూచించిందని గుర్తు చేశారు.

## బాబూ జగ్జీవన్ రామ్‌కు సీఎం చంద్రబాబు ఘన నివాళి

**అమరావతి, ఏప్రిల్ 5 (నినాదం):**

భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘన నివాళి అర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆజన్మాంతం కృషి చేసిన ధీరుడని ఆయన కొనియాడారు. ఈ మేరకు చంద్రబాబు ఆదివారం సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. విద్యార్థి దశ నుంచే అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించి, ప్రజలలో చైతన్యం తీసుకొచ్చిన గొప్ప సామాజిక సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ అని చంద్రబాబు ప్రశంసించారు. "సుదీర్ఘ కాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసి చట్టసభల్లో తన సత్తా చూపిన ఆయన, ఆఖరి క్షణం వరకూ దళిత జాతి సముద్ధరణ కోసమే తపించారు" అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి నివాళి అర్పిస్తున్నానని, ఆయన స్ఫూర్తిని భావి తరాలు ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## క్రీడల్లో దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలుపుతాం

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన క్రీడా పోటీల ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, క్రీడల ప్రాముఖ్యతను వివరిస్తూ యువతకు దిశానిర్దేశం చేశారు. 1950 నుండి 1960 మధ్య కాలంలో హైదరాబాద్‌ను 'నర్సరీ ఆఫ్ ఇండియన్ ఫుట్‌బాల్'గా పిలిచేవారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. 1956 ఒలింపిక్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టులో ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన వారే ఉండటం మన నగర ఖ్యాతికి నిదర్శనమన్నారు. అలాగే, నిఫా వ్యవస్థను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన స్పె మాస్టర్ బీఎన్ మల్లిక్ సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ టోర్నమెంట్‌లో దేశం నలుమూలల నుండి వచ్చిన 34 జట్లు అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాయని క్రీడాకారులందరినీ అభినందించారు. ఇటీవల తాను సందర్శించిన దక్షిణ కొరియాలోని స్పోర్ట్స్ యూనివర్సిటీ గురించి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు.

# రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న విమానాన్ని కూల్చివేశాం

పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు మొదలై నేటికి ఐదు వారాలు గడిచినా యుద్ధ ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. అమెరికా– ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ఇరాన్ గట్టిగా బదిలిస్తూనే వస్తోంది. అయితే, ఇటీవల అమెరికాకు చెందిన ఎఫ్–15ఈ ఫైటర్ జెట్‌ను ఇరాన్ భద్రతా దళాలు కూల్చివేశాయి. ఆ ప్రమాదంలో ఒక పైలట్ చాకచక్యంగా తప్పించుకోగా, మరో పైలట్ ఇరాన్ గడ్డపై చిక్కుకుపోయినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. దీంతో పైలట్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టింది అమెరికా. ఈ నేపథ్యంలో గల్లంతైన రెండో పైలట్‌ను సురక్షితంగా రక్షించామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దానికి బదులుగా ఇరాన్, పైలట్ కోసం రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న విమానాన్ని కూల్చివేసినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. శత్రుదేశానికి చెందిన విమానాన్ని ఇస్ఫహాన్ దక్షిణ ప్రాంతంలో ఐఆర్‌జీసీ దళాలు నేలమట్టం చేశాయని ఇరాన్ మీడియా తెలిపింది. అది అమెరికా దళానికి చెందిన సీ–130గా పేర్కొంది. ఫరాజ్ రేంజర్స్ అనే పోలీసు కమాండో యూనిట్ ఈ విమానాన్ని కూల్చివేసినట్లు ఖతార్ మీడియా తెలిపింది. ఇతర ఫైటర్‌జెట్లకు సీ–130 రీఫ్యూయలింగ్ చేసేందుకు వచ్చినట్లు పేర్కొంది. అయితే, ఆ ఎయిర్‌క్రాఫ్ట్‌లోని సిబ్బందికి సంబంధించి ఎలాంటి సమాచారం వెలువడలేదు. అంతేకాదు, ఈ విషయంపై అమెరికా నుంచి కూడా ఎలాంటి స్పందన లేదు.



ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన అనేక విమానాలను ఇరాన్ సాయుధ దళాలు కూల్చివేసినట్లు ఇరాన్ మీడియా కథనాలు తెలిపాయి. అదేవిధంగా అమెరికా దళాలకు చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ ఆ విషయాన్ని వెల్లడించినట్లు పేర్కొన్నాయి. అయితే, కూల్చేవేసిన వాటిల్లో ఒక C-130 విమానంతో పాటు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లు ఉన్నాయని ఖతమ్ అల్– అన్బియా కేంద్ర ప్రధాన కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

**'ట్రంప్ హెచ్చరిక తెలివితక్కువ చర్య'**

మరోవైపు, 48 గంటల్లోగా హర్మూజ్‌ను తెరవాలని లేదంటే నరకం చూపిస్తామని శనివారం ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. అయితే, ఈ విషయంపై ఇరాన్ గట్టిగా బదులిచ్చింది. 'ట్రంప్ హెచ్చరిక తెలివితక్కువ చర్య' అని అభివర్ణించింది. తమ వంతెనలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ చేస్తున్న బెదిరింపులు హాస్యాస్పదంగా ఉన్నాయని పేర్కొంది. శత్రువులు తమ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే తీవ్రంగా స్పందిస్తామని ఇరాన్ హెచ్చరించింది. అదేవిధంగా, అమెరికా– ఇజ్రాయెల్‌కు త్వరలోనే బిగ్ సర్‌ప్రైజ్ ఇవ్వనున్నామని ఇరాన్ భద్రతాధికారి ఒకరు పేర్కొన్నారు. యుద్ధంలో ఇరాన్ తన సొంత ప్రణాళికలు, నిర్దిష్ట లక్ష్యాల ప్రకారమే ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా లక్ష్యాల జాబితా లోపభూయిష్టంగా ఉందన్నారు.

ఇదిలా ఉండగా, యుద్ధంలో ఆరితేరిన జనరల్స్‌ను ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ ఎం.బి. ఘాలిబాఫ్ ప్రశంసించారు. గత కొద్దిరోజులుగా అమెరికా, ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల మధ్య బాహ్య ఒత్తిళ్ల కంటే జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తున్నందుకు వారిని అభినందించారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడం, చమురు ధరలను నియంత్రించడం వంటి నిర్ణయాలతో అమెరికా సతమతమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇది దీర్ఘకాలంలో అమెరికన్ పన్ను చెల్లింపుదారులపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన నొక్కి చెప్పారు. యుద్ధంలో అమెరికా స్వల్పకాలిక సైనిక విజయాలు సాధించవచ్చని, అయితే పశ్చిమాసియా ఇంధన మౌలిక సదుపాయాల విధ్వంసం కారణంగా దశాబ్దాల పాటు అధిక ఇంధన ధరలు, ఆర్థిక అస్థిరత అనేవి అమెరికాకు దీర్ఘకాలిక మూల్యంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

## యూడీఎఫ్ సర్కార్ వస్తే.. కేరళంలో భూభారతి అమలు

మొదటి పేజీ తరువాయి

సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని తెలిపారు. అదే విధంగా కేరళంలోకూడా యూడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే ఐదు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కేరళంలో గత పది సంవత్సరాలుగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ పాలన ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక రంగాల్లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. "కేరళం ప్రజలు ఈసారి స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారు. పది సంవత్సరాల అసమర్థ పాలనకు ముగింపు పలికి, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం యూడిఎఫ్‌కు అధికారం అప్పగించాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా విభజన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విభేదాలు పెంచే బీజేపీకి కేరళం లో స్థానం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం యూడిఎఫ్ మాత్రమేనని స్పష్టం చేశారు. "ఇది సాధారణ ఎన్నిక కాదు.. కేరళం భవిష్యత్తును నిర్ణయించే ఎన్నిక. ప్రజలు సరైన నిర్ణయం తీసుకుని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించి, యూడిఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి ప్రచారానికి ప్రతిచోట ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

## హార్ముజ్ జలసంధిని తక్షణమే తెరవండి

హార్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌పై భీకర దాడులు తప్పవని హెచ్చరించారు. "మంగళవారం పవర్ ప్లాంట్ డే. బ్రిడ్జి డే. అన్నీ కలిపి ఇరాన్‌లోనే జరుగుతాయి. దీనికేదీ సాటిరాదు. హార్ముజ్ జలసంధిని తెరవండి. లేకుంటే ఇరాన్‌లో కాదు. నరకంలో ఉన్నట్లే. చూస్తూ ఉండండి. అల్లాను ప్రార్థించండి" అంటూ ట్రంప్ పేర్కొన్నాడు. అంతేకాదు.. వర్ణించలేని బూతు పదాల్ని వాడాడు. హార్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందే అని ఇరాన్‌కు ఇప్పటికే ట్రంప్ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. తాను చెప్పినట్లు చేయకపోతే ఇరాన్‌లోని బ్రిడ్జిలు, పవర్ ప్లాంట్లపై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. అయితే, ట్రంప్ హెచ్చరికను ఇరాన్ తేలికగా తీసుకుంది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. ఇరాన్ కూడా కువైట్, బహ్రెయిన్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తోంది. అలాగే, తమ దేశంలోని పౌర కేంద్రాలపై దాడులు చేస్తే తాము కూడా మరింత బలంగా దాడి చేస్తామని హెచ్చరించింది.

## మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



**వికారాబాద్, ఏప్రిల్ 5(నినాదం ):** మున్సిపల్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 15 లక్షలు ఇవ్వాలని కాళిపోస్టులు భర్తీ చెయ్యాలి కనీస వేతనాలు అమలు చెయ్యాలని కోరుతూ ఆదివారం జిల్లా కేంద్రంలో సీ ఐ టీ యూ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీ ఐ టీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ మహిపాల్ మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. అదేవిధంగా కాళి పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్ జీతాలు,పి ఆర్ సీ ఇవ్వాలని ప్రభుత్వనికి డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని, అందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వనికి కోరారు. లేనిపక్షంలో పోరాటలు ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీ ఐ టీ యూ నాయకులు, మున్సిపల్ కార్మికులు సంగయ్య బాలయ్య అనసూయ జంగమ్మ, ఆశ, పద్మ కమలమ్మ మలమ్మ స్వరూప, శ్రీనివాస్ బాలయ్య శంకర్ మహేంద్ర, యాదయ్య, ఆశయ్య, భాస్కర్ రాజు వెంకటయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు

## వేసవి తాపాన్ని నివారించుటకు
# చలివేంద్రాలు దోహదం

### చలివేంద్రం ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెల్లీ వేంద్రాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, వేసవి కాలంలో వాహనదారులకు, పాదచారులకు, వేసవి తాపాన్ని నివారించుటకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో దోహదపడతాయన్నారు. చలివేంద్రాలతో చల్లని తాగునీరు అందించడం ఎంతో సేవాభావంతో కూడుకున్న కార్యక్రమమని, ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు. సమాజంలో సేవా భావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల సంజీవరెడ్డి,మైసిగారి శ్రీనివాస్, ట్రస్ట్ అధ్యక్షులు దేగల సతీష్ బాబు,రంజిత్, కుంపట్ల శ్రీనివాస్,సురేంద్రనాథ్ రెడ్డి,నరసింహ రెడ్డి, డేవిడ్ రాజు,రమేష్, నారాయణ, సత్యనారాయణ,వికాస్, గఫ్ఫార్, రహీం, అసిఫ్, రెహానా షైక్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ ఆశయాలను
# ముందుకు తీసుకెళ్లాలి



**పాలేరు, ఏప్రిల్ 05(నినాదం) :** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పలువురు పిలుపునిచ్చారు. నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బైరవునిపల్లి లో ఆయన విగ్రహం కు పూలమాలల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ప్రతినిధి పెద్దపాక ముత్తయ్య మాట్లాడారు.మహనీయుడు చూపిన మార్గం ను అనుసరించాలని సూచించారు. ఆయన మార్గంలో నడవటమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చలకూరి వెంకటేశ్వర్లు, పి. వెంకట్, గుండు సైదులు తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లి లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు. మండలం లోని రాయగూడెం లో బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం ను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దళిత బాంధవుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

### నున్నా రవికుమార్



**పాలేరు, ఏప్రిల్ 05 (నినాదం) :** ప్రముఖ స్వతంత్ర సమరయోధులు దళిత బాంధవుడు సమతా వాది సంఘసంస్కర్త మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా నేలకొండపల్లి బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండలం,రావిగూడెం గ్రామంలో వారి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ నున్నా రవికుమార్ పాల్గొని ఈ సందర్భంగా వారిని స్మరిస్తూ వారికి ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కొండా హర్ష, బీజేవైఎం మండల అధ్యక్షుడు తంగెళ్ల సతీష్, సీనియర్ నాయకులు కాలింగ్ వెంకటేశ్వర్లు పోతనబోయిన శేషగిరి, గోపి సూరేపల్లి ప్రసాద్ ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

### పటాన్చెరులో ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, ఏప్రిల్ 05 (నినాదం):** భారత మాజీ ఉప ప్రధాని, దేశంలో సామాజిక న్యాయ సాధనకు అవిరళ కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం పటాన్చెరు పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి స్థానిక మాజీ ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

**పాలేరు, ఏప్రిల్ 05(నినాదం) :** పాలేరు,నియోజకవర్గం నేలకొండపల్లిలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్,118 వ జయంతి కార్యక్రమం ఎమ్మార్పీఎస్,ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల కేంద్రంలోని పీఎస్ఆర్ సెంటర్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మాదాసు వెంకన్న మాదిగ అధ్యక్షత వహించిన ఈ యొక్క కార్యక్రమంలో వంగూరి ఆనందరావు మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు కాసాని నాగేశ్వరావు గౌడ్ బిఆర్ఎస్ జిల్లా నాయకులు పగిడి కత్తుల ఈదయ్య మాదిగ.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగటి కత్తుల నాగేశ్వరావు సిపిఎం మండల కార్యదర్శ వర్గ సభ్యులు గంజికుంట్ల క్రీస్తుదాసు మాల మహానాడు మండల నాయకులు తోళ్ల సురేష్ మాదిగ ఎమ్మార్పీఎస్,జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె నాగుల్ మీరా టీడీపీ మండల నాయకులు మామిడి వీరభద్రం,ముదిరాజ్ సంఘం నాయకులు కైలాసపూ నాగేశ్వరావు ముదిరాజ్ సంఘం నాయకులు,తదితరులు పాల్గొని మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ బీహార్ రాష్ట్రంలోని చాంద్వా గ్రామంలో చమర్ (మాదిగ) కులంలో 1908 ఏప్రిల్ 5న జన్మించినాడు. ఆనాడే ఉన్నతమైన చదువులు చదువుకొని తను చదువుకొను సమయాలలో ఆయా స్కూళ్లలో కుల వివక్షత పాటిస్తే ఆ యొక్క కుల వ్యవస్థ పై ఆయా స్కూల్లోని విద్యార్థులను కూడగట్టుకొని పోరాటాలు నిర్వహించినాడు.అదే సమయములో భారతదేశ స్వతంత్ర కొరకు మాహాత్మ గాంధీ పిలుపూ మేరకు ఉన్నతమైన చదువులను వదిలివేసి చిన్న వయసులోనే దేశ స్వతంత్ర ఉద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్నారు, అంతేకాకుండా



గాంధీ,బాబు రాజేంద్రప్రసాద్,నెహ్రు, పటేల్ గార్లతోపాటు అనేకసార్లు జైలుజీవితం కూడ గడిపినారూ, భారతదేశ స్వతంత్ర సమయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి మరియు దేశ స్వతంత్ర ఉద్యమ (గాంధీ,,నెహ్రు, పటేల్ తదితరులకు) నాయకులకు కొన్ని విషయాలలో అభిప్రాయ భేదములు వచ్చిన సందర్భాలలో ఇరు వర్గాల వారినీ సమన్వయ పరిచిన మహా వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ ఇలాంటి సందర్భాలలో ఎవరిది తప్పు అయినా సరే తను చాలా స్పష్టంగా, సూటిగా వారి వారి తప్పులను ఎత్తిచూపుతూ,పరిష్కారం చూపేవాడు, దేశ స్వతంత్ర అనంతరం దేశమునకు రైల్వే,రక్షణ, తంతి తపాలా,వ్యవసా య, విదేశాంగ తదితర మంత్రిత్వ శాఖలను నిర్వహించినాడు తను ఏ మంత్రత్వ శాఖ చేసిన ఆయా మంత్రిత్వ శాఖలను గ్రమస్థాయి వరకు విస్తరింపచేవాడు. ఒక సందర్భంలో వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ ఒక సభలో జగజీవన్ రామ్ గురించి మాట్లాడుతూ దేశములో ఆహార ధాన్యాల కొరత తీవ్రంగా ఉన్న దశలో గోధుమ విప్లవం ద్వారా గోధుమ ఉత్పత్తిని పెంచి వ్యవసాయ రంగంలో స్వర్ణ యుగాన్ని సృష్టించిన ఘనత బాబు జగ్జరంకే దక్కిందని, అట్లాగే ఆహార ధాన్యాలను దేశ అవసరాలకు తగిన విధంగా ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో జగ్జీవన్ రామ్ నేతృత్వంలోనే జాతీయస్థాయి వ్యవసాయ విధానంపై ముసాయిదా తయారయిందన్నారు జగ్జీవన్ రామ్ ఆలోచనకు అనుగుణంగా ఇప్పుడు దేశంలో వ్యవసాయం విధానాన్ని చేపడుతున్నారు.మరొక సభలో ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ (కార్మిక నాయకుడు)బిటి రణదీవ్ బాబు జగ్జమరం రాసిన పుస్తకంపై సమీక్షించి అత్యధిక కాలం అధికారంలో దళిత నాయకుడిగా బాబు జగ్జీవరం అనుభవాలు అభిప్రాయాలు ప్రత్యేకంగా పరిశీలన అవుతాయి అని అన్నారు, భారతదేశంలో వివక్షత సమాజంలోనే కాదు సొంత పిల్లలపైన(ఇంట్లో) కూడా ఉంటుందని మగ పిల్లగాని ఒక రకంగా ఆడపిల్లను మరోరకంగా చూస్తారని కానీ జగజీవన్ రామ్ తనకు ఇద్దరు సంతానం(సురేష్ కుమార్, మీరా కుమార్ (కుమార్తె) ఉన్నప్పటికీ రాజకీయంగా తన వారసురాలుగా తన యొక్క కుమార్తె అయిన మీరా కుమార్ నే ప్రోత్సహించినారు. మీరా కుమార్ భారతదేశానికి తొలి పార్లమెంట్ మహిళా స్పీకర్గా పనిచేయటమే కాకుండా తెలంగాణ రాష్ట్రం సిద్ధించుటలో తన పాత్రను పార్లమెంటు స్పీకర్ స్థానంలో ఉండి పోషించినరని తెలిపినారు.

# పల్లె పల్లెకు బీజేపీ జెండా
# పండుగను ఘనంగా నిర్వహించాలి

- బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇంచార్జి నాగపూరి రాజమౌళి గౌడ్

**మల్హర్, ఏప్రిల్ 05 (నినాదం):** పల్లె పల్లెలో బీజేపీ జెండా పండుగను విస్తృతంగా నిర్వహించాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇంచార్జి నాగపూరి రాజమౌళి గౌడ్ పిలుపునిచ్చారు. కాటారం మండల కేంద్రంలో కాటారం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి పెద్దపల్లి జిల్లా కో-కన్వీనర్ డాక్టర్ మొహమ్మద్ రఫి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగపూరి రాజమౌళి గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 6న జరగనున్న బీజేపీ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి కార్యకర్త పండుగలా నిర్వహించాలని సూచించారు. ప్రతి కార్యకర్త తన ఇంటిపై పార్టీ జెండాను ఎగురవేయాలని, ఏప్రిల్ 8 వరకు గ్రామ స్థాయిలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే, బీజేపీ కార్యకర్తలు వార్డు సభ్యులు, సర్పంచ్‌లుగా గెలిచిన గ్రామాలకు కేంద్ర మంత్రులతో చర్చించి ప్రత్యేక నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. త్వరలో అలాంటి గ్రామాలను సందర్శిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా వివిధ మండలాల కన్వీనర్లు, కో-కన్వీనర్లను ప్రకటించారు. కాటారం



మండలానికి బండం మల్లరెడ్డి కన్వీనర్‌గా, చీర్ల అశోక్ రెడ్డి, బొంతల రవీందర్ ముదిరాజ్, ఇజమూరి సాధనధం కో-కన్వీనర్లుగా నియమితులయ్యారు. మల్హర్ మండలానికి గంగాధరి సమ్మయ్య కన్వీనర్‌గా, వేమునూరి సతీష్ రెడ్డి, రాళ్లబండి ప్రశాంత్ కో-కన్వీనర్లుగా ఎంపికయ్యారు.మహాముత్తారం మండలానికి లింగమళ్ళ సాద్దు వాలి కన్వీనర్‌గా, పసుల శివ, సాట్ల అంజి బాబు కో-కన్వీనర్లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. మహాదేవపూర్ మండలానికి బొల్లం కిషన్ కన్వీనర్‌గా, నాగుల సాయి, లింగంపల్లి జోగేశ్వర్ కో-కన్వీనర్లుగా నియమితులయ్యారు.

# కాలనీలలో మురుగు పరుగు

- సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు


**అల్వాల్, ఏప్రిల్ 5 (నినాదం):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం ప్రాంతంలోని గణపతి దేవాలయం సమీపంలో రెడ్డి బస్తీల్లో రోడ్డుపై మురుగునీరు ప్రవాహంతో స్థానిక లతో పాటు ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకుగురిఅవుతున్నారు. నిత్యం రోడ్డుపై మురుగునీరు పరుగులు పెడుతుండడంతో పరిసరాల ప్రజలు దుర్వాసనతో పాటుగా సమస్యలు తలెత్తుతున్నాయంటూ పౌరులు స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై డ్రైనేజీ పైప్ లైన్ తో పాటుగా మ్యాన్ హోల్ నిర్వహణ కొరాపడవడడం వల్ల నిత్యం డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపై ప్రవాహంగా పారుతుంది. ఒకపక్క ప్రముఖ గణపతి ఆలయం మరోపక్క మచ్చబొల్లారం కూరగాయలమార్కెట్ ఉండడంతోఎప్పుడుప్రజలురాకపోకలతోరద్దీగా ఉంటుంది. రెడ్డి బస్తీలో మురుగునీరు రోడ్డుపై పరుగులుపెడుతూదుర్వాసన వెదజల్లుతుండడంతో పౌరులతో పాటు కాలనీవాసులు ప్రజలు నిత్యం సతమతమవుతు పడరాబాధలు పడుతున్నారు. దుర్వాసనను భరించలేక తాము ప్రతిరోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూవినియోగదారులతోపాటు ప్రజలు భక్తులు వాపోతున్నారు. అయినప్పటికీ సంబంధిత సర్కిల్. జలమండలి యంత్రాంగం ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయం అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పునరావతం కాకుండా సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే



స్పందించి పటిష్టమైన చర్యలకుయుద్ధ ప్రతిపాదన చేపట్టాలని లేనిపక్షంలో సర్కిల్ కర్యాలయం వద్ద ఆందోళన దిగుతామని స్థానికులు పేర్కొన్నారు. డ్రైనేజీ. పైపులైన్ ల పునరుద్దీన. మ్యాన్ హోల్స్ ను ఆధునికరించడం వంటి తదితర పనులు చేపట్టి ప్రజలకు సహకరించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## సమాన హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్





- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 - సూరారం డివిజన్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో నిర్వహించిన మాజీ ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య ఆతిధిగా హాజరై బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులార్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు లభించాలని, బడుగు, బలహీన వర్గాల వారి హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని, వారి ఆశయ సాధన వైపుగా నేటి యువత ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక సలహాదారులు కె. కిషన్ రావు, మద్దెల సత్యనారాయణ, కమిటీ సభ్యులు జేమ్స్, రామచందర్, ఎల్లయ్య, జేజారత్నం, నరసింహ, ప్రేమ్ కుమార్, అమర్ బాబు, బుచ్చయ్య, మీసాల బుచ్చయ్య, డేవిడ్, యాదయ్య, మల్లేష్, బిక్షపతి, గట్టు అశోక్, సత్తయ్య, మాజీ కార్పొరేటర్ జగన్,డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, పోలే శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ జగన్, సీనియర్ నాయకులు వారాల వినోద్, యూసుఫ్, గుబ్బల లక్ష్మీ నారాయణ, ప్రభాకర్, కోలా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక భారత నిర్మాణ స్ఫూర్తి ప్రదాత జగ్జీవన్ రామ్

- బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి
- మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్

**జవహర్ నగర్, ఏప్రిల్ 5 (నినాదం):** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన కృషివలుడు, ఆధునిక భారత నిర్మాణస్ఫూర్తి ప్రదాత, భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావేనని జవహర్ నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్ పేర్కొన్నారు. భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ బాలాజీ నగర్ చౌరస్తా దగ్గర మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్ నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు హాజరై జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి వందనం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్ మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలోనూ స్వరాజ్యం వచ్చిన తర్వాత ఆధునిక భారత నిర్మాణంలోనూ ఆయన స్ఫూర్తిదాయకమైన సేవలు అందించారని అన్నారు. గొప్ప రాజకీయవేత్తగా సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడి అనేక పదవులను చేపట్టి తనదైన ముద్ర వేశారని తెలిపారు. జగ్జీవన్ రామ్ జీవితాంతం



బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. దేశ రక్షణ మంత్రిగా ఆయన వేసిన బాటలు దేశాన్ని సురక్షితంగా ఉంచాయన్నారు. మనందరం కలిసి సమ సమాజ అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బాబు జగ్జీవన్ రామ్ సాయుధ దళాలకు ప్రత్యేక గౌరవం ఇచ్చి దేశ రక్షణలో అందరిని భాగస్వాములను చేశారని పేర్కొన్నారు .ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మొగిలిపాక పరుశరాం, కోశాధికారి ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, మాజీ మేయర్లు, మాజీ డిప్యూటీ మేయర్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు, జవహర్ నగర్ లోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి ప్రధాన కార్యదర్శి
## రావూరి మౌళేశ్వరరావుకు సన్మానం

### కార్యక్రమానికి హాజరైన కొలను శ్రీనివాసరెడ్డి




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5 (నినాదం):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కాబడిన సందర్భంగా రావూరి మౌలేశ్వరరావు ను బాలాజీ హిల్స్ రెసిడెన్షియల్, వెల్ విషర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.నిజాంపేట గ్రామ ప్రధాన ప్రజానాయకుడు కొలన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ అసోసియేషన్స్ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొని మౌలేశ్వరరావు ను అభినందించారు. ఈ సందర్భంగా సభా నిర్వాహకులు కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పనిచేసే వారికి పదవులు వాటి అంతట అవే వస్తాయని దానికి నిదర్శనమే మౌలేశ్వరావు కు జిల్లా పదవి దక్కటం అని గుర్తు చేశారు. ఎవరైనా సరే పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించి తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు. మౌలేశ్వరరావు మరింత కష్టపడి పార్టీ ఎదుగుదలకు కార్యకర్తలకు అండగా ఉండాలని, పార్టీ కార్యకర్తల వెన్నంటే ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశానికి విచ్చేసిన వివిధ కాలనీల ప్రతినిధులకు కాలనీవాసులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించి చుట్టుపక్కల ఉన్న అన్ని కాలనీల వారిని ఒకే తాటిపైకి తీసుకువచ్చిన కొమ్మి చిరంజీవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలూరు సత్యానాని, వర్మరాజు, పంగా శ్రీనివాసరావు లతోపాటు ఇందిరమ్మ కాలనీ ఫేస్ వన్, ఫేస్ టు, ఫేస్ త్రి, కొలన్ తులసి రెడ్డి కాలనీ, బాలాజీ కాలనీ వెంకటరాయ నగర్, శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, వినాయక నగర్ సిరి ఎంక్లేవ్ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**సిద్దిపేట, ఏప్రిల్ 05 (నినాదం) :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజీఆర్ చౌరస్తా వద్ద డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి హాజరై, దళిత సంఘాల నాయకులతో కలిసిబీజీఆర్ చౌరస్తా వద్ద డా: బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ డా. బాబు జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం విశిష్ట సేవలు అందించి, సామాజిక న్యాయసాధనకు కృషి చేసిన మహానేత అని కొనియాడారు.ఒక నాయకుడు ఉన్నత స్థాయికి ఎదగాలంటే అనేక సవాళ్లను ఎదుర్కొని, సమస్యలను అధిగమించే ధైర్యం అవసరమని పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలు, కృషిని ఆదర్శంగా తీసుకొని సమాజంలో వివక్ష లేకుండా ప్రతి ఒక్కరూ ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగాలని ఆకాంక్షించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత నాయకుడని, మహిళల సాధికారత, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. అందరికీ అవకాశాలను కల్పించే దిశగా మనకోసం రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసిన ఘనత డా. అంబేద్కర్ దేనని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డిఓ సదానందం, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి హమీద్ వివిధ సంఘాల నాయకులు బొమ్మల యాదగిరి, నాయకులు బైరి రాజేశం, ఎర్రమహేందర్, లింగంపల్లి శ్రీనివాస్, బయ్యారం ఇస్తారి, పరుశరాములు, డి. శంకర్, భీమసేన, ఎల్లేష్, రామస్వామి, చుంచు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 5 (నినాదం):** స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు హైదర్‌గూడలోని దీజీ= కమిటీ హాల్లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బస్తీ వాసులు, పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ అధ్యక్షులు సోమవారం రాజ్ కుమార్ పాల్గొని . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు సామాజిక సమానత్వం కోసం అనగానే వర్గాల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం పూర్తి దయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వనం నరసింహ, సోమవారం రవీందర్,శ్యామ్ , బాలమురళీకృష్ణ, మహేందర్, శీను, సందీప్,చిన్నప్రదీప్ మహేష్, రమేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాల గురించి ప్రతినిత్యం కుటుంబ సభ్యులతో చర్చించండి

**చదువు విషయంలో జగ్జీవన్ రామ్, అంబేద్కర్ ఆశయాలు బోధించండి**

**మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపు**





**మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 5 (నినాదం):** ప్రతిరోజూ బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జీవితాల గురించి మీ కుటుంబాల్లో, మీ పిల్లలతో చర్చించాలనీ, చదువు విషయంలో పిల్లలను మోటివేట్ చేయాలని మల్కాజ్గిరి శాసనసభ సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి చింతల్ బస్తి లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లైబ్రరీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ జైపాల్ రెడ్డి హాజరై డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి సమ సమాజ స్థాపనకు జీవితకాలం శ్రమించిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు 40 సంవత్సరా లు సుదీర్ఘంగా పార్లమెంటులో శాసన సభలో వివిధ హోదాలలో పని చేసి బడుగు బలహీన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు తన సేవలను అందించారు అని అన్నారు. రాజ్యాంగం లోని చట్టాలను సవరణలను హక్కులను బడుగు బలహీన వర్గ ప్రజల అభివృద్ధికి ఉపయోగించిన మహనీయుడని అన్నారు. దళితుల అభ్యుదయానికి నిరంతరం కృషి చేసిన సంఘసంస్కర్త భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. ప్రజల సంక్షేమానికై చేసే పనులలో పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే కోరారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి, బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఇంకా చాలా మంది పెద్దల జయంతిలు జరుపుకుంటాం ఎందుకంటే, వారి జీవితాల నుంచి మనమందరం నేర్చుకోవాలి, దాంతో పాటు మిగతా ప్రజలందరికీ వారి జీవితాలకు సంబంధించి వారు చిన్నప్పటి నుంచి పెద్దయ్యే వరకు ఏమేమి పోరాటాలు చేశారు, వారి సిద్ధాంతాలు, ఆదర్శాలు ఏమున్నాయి అవన్నీ సమాజమంతా తెలుసుకోవాలి. ఈ ఉద్దేశ్యంతోటే ప్రభుత్వం ద్వారా ఇలాంటి జయంతిలు ఏర్పాటు చేయడం జరుగుతుంద న్నారు. బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ ఒక్క సంప్రదాయానికో, ఒక్క కులానికో చెందినవారు కాదు, వారు మనందరి వారు, వారి జీవితం ఒక సందేశం అది మనందరం గుర్తుపెట్టుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కులాంతర వివాహాలు చేసుకున్నవారికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహక ఎఫ్ డి బాండ్స్ అందజేశారు. దళితుల అభ్యున్నతికి కృషిచేసిన వారికి దళిత రత్న అవార్డులు ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్, జోనల్ కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన పాటలు అందరినీ ఎంతగానో ఆహ్లాద పరిచాయి మల్కాజ్గిరి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల వివిధ సంఘాల అధ్యక్షులు సభ్యులు సంబంధిత అధికారులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# అపర భద్రాద్రిలో ఎమ్మెల్యే గండ్ర ప్రత్యేక పూజలు

**ఘన స్వాగతం పలికిన అర్చకులు పాలకవర్గం**

**ఘనంగా సన్మానించిన ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు**





**జమ్మికుంట, ఏప్రిల్ 5 (నినాదం) :** అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం దర్శించుకు న్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇల్లంతకుంట లోని శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కు ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇల్లందకుంట దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు శాలువాతో సన్మానం చేసి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్వ కాలము నుండి పేరు ప్రఖ్యాతలు పొందిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానికి రావడం ఆనందంగా ఉందని అన్నారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేష్ కిరణ్, రాజేందర్, గోపాల్, కిషన్,శ్రీనివాస్, మల్లేష్,రామ్ రెడ్డి నగేష్ మాజీ ఎంపిటిసి రామ్ స్వరన్ రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్ కిరణ్,టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సతీష్,అభి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్5 (నినాదం) : భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, శాసనసభ్యులు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ చిన్నతనం నుంచే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, ఉన్నత ఆలోచనలు, కష్టపడి పనిచేయడం, నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండేలా కృషి చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, విద్యార్థులు కృషి చేసి జీవితంలో ఎదగాలని సూచించారు. యువత ఆయన చూపిన మార్గంలో నడిచి సమానత్వ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నదని, అందుబాటులో ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో యువత సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బాబు జగ్జీవన్ రామ్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు, యువత ముందుకు సాగాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించి జిల్లాలో అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కుల సంఘాల ప్రతినిధులకు సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడని తెలిపారు. దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడి, కేంద్ర మంత్రిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించి దేశ అభివృద్ధికి విశేషంగా సేవలందించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ పని చేస్తోందని తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు ఆహూతు లను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి దేశానికి సేవ చేసే ఆఫీసర్లుగా తయారు కావాలి

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి**





**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 5 (నినాదం) :** పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకొని బాగా కష్టపడి చదివి విద్యార్థులు దేశానికి సేవ చేసే ఆఫీసర్లుగా తయారు కావాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ హైస్కూల్లో 19వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకు న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఒకప్పటి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వనపర్తి పట్టణమే విద్యకు నిలయంగా ఉండేదని చెప్పారు. 2006 సంవత్సరంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పాఠశాల కరస్పాండెంట్ ముబీన్ ఆహ్వాన మేరకు వచ్చి మదర్స్ ల్యాప్ హైస్కూల్ ను ప్రారంభించామని, అప్పుడు 50 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రస్తుతం 850 మంది విద్యార్థులు స్కూల్లో విద్యను అభ్యసిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. పట్టణంలో ఉన్న ప్రముఖ ప్రైవేటు పాఠశాలల్లో మదర్స్ ల్యాప్ హైస్కూల్ ఒకటని అన్నారు. స్కూల్లో చదువుకునే విద్యార్థులు మీ భవిష్యత్తును రూపొందించుకోవడానికి ఒక విద్యాలయమే ఉన్నతమైందని చెప్పారు. పోటీ ప్రపంచంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని, విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రాతినిధ్యం కల్పించాలని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ ముబీన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, నాయ కులు సహదేవుడు, బాబా, కౌన్సిలర్ విజయలక్ష్మి, ఎత్తం చరణ్ రాజ్, బాలరాజు, సురేష్, రాంజీ నాయక్, గట్టురాజు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యువత ఫోన్లో కాకుండా మైదానంలో గడపాలి

**ప్రభుత్వాలకు ధీటుగా క్రికెట్ మైదానాన్ని నెలకొల్పడం అభినందనీయం**

**కేశాపూర్ లో గ్రౌండ్ ను ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**



**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్5 (నినాదం) :** యువత తమ సమయాన్ని ఫోన్లో కాకుండా మైదానంలో గడపాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. కేశాపూర్ లో వైద్యులు అభినవ్, కిరణ్ కుమార్, చైతన్య కుమార్, ప్రశాంత్ రెడ్డి లు ఏర్పాటు చేసిన రాకెట్స్ క్రికెట్ గ్రౌండ్ ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కేవలం వైద్యమే కాకుండా యువత కోసం క్రికెట్ మైదానాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అయితే ఆశించిన స్థాయిలో సౌకర్యాలు లేకవడం క్రీడాకారులకు శాపంగా మారిందనన్నారు. జిల్లాలో ఎటువంటి సౌకర్యాలు లేకున్నా అంతర్జాతీయ స్థాయిలో ఆయా క్రీడా అంశాల్లో రాణిస్తున్న క్రీడాకారులు ఎందరో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ...జిల్లాలో మాత్రం స్టేడియం లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే తాను స్టేడియం విషయం అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు. అలాగే యువత డ్రగ్స్, మద్యం వైపు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలన్నారు. అలాగే అన్ని పార్టీల నాయకులు కలిసి కట్టుగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, నగర మేయర్ ఉమారాణి, డీసీపీ బస్వారెడ్డి, కేశాపూర్ సర్పంచ్ గంగాధర్, డాక్టర్ మోతీలాల్, బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే

**బాల్కొండ ఇన్చార్జ్ సునీల్ కుమార్ రెడ్డి వెల్లడి**



**ఆర్మూర్, ఏప్రిల్ 5 ( నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండు సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ బాటలోనే ఇందిరమ్మ ఇండ్ల సొంతింటి కల నిజం చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దేనని బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రోజున నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో కర్రె అనిత అనే కుటుంబ సభ్యులకు సొంతింటి లేక అద్దె ఇంట్లో కొనసాగుతూ ఉండడంతో, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ స్థలం కేటాయించడమే కాకుండా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడంతో వారు తమ ఇంటిని పూర్తి చేయించుకు న్నా ఓరని, ఆదివారం రోజున కర్రె అనిత నిరుపేద కుటుంబ సభ్యులు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవే శం చేస్తున్న నేపథ్యంలో వారి ఆహ్వానం మేరకు వెళ్లి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇంటి గృహప్రవేశం చేసిన కర్రె అంత కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి సీఎం రేవంత్ రెడ్డి కల విడతల వారీగా అందించి, ఇల్లు లేని ప్రతి ఒక్కరికి సొంతింటి కల నిజం చేయ నున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, వైస్ చైర్మన్ బుచ్చయ్య, కమ్మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకేట్ రవి, గ్రామ,మండల, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, మహిళలు, పాల్గొన్నారు.

# పలువురిపై ఫోక్సో కేసు నమోదు.?

**హుజురాబాద్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఘటన కూపి లాగుతున్న పోలీసులు**



**కరీంనగర్ ప్రత్యేక ప్రతినిధి, ఏప్రిల్5 (నినాదం) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హుజురాబాద్ పోలీస్ సబ్ డివిజన్ లో ఒక మైనర్ బాలికపై పలుసార్లు లైంగిక వేధింపులకు పాల్పడి ఆమెను బెదిరించినట్లు నిర్ధారణ కావడంతో సుమారు పది మందిపై ఫోక్సో కేసు నమోదు స్థానికంగా జోరుగా చర్చ జరుగుతుంది. నినాదం కు అందిన సమాచారం మేరకు, హుజురాబాద్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో గల ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి ఒక ప్రైవేటు విద్యాసంస్థలో చదువుతున్న మైనర్ బాలికను గత కొన్ని నెలలుగా తమ సమీప బంధువులు ఆ పాఠశాల సిబ్బంది సహకారంతో తీసుకొని వెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఈ విషయాన్ని బయటకు చెబితే చంపేస్తామని బెదిరించి పలు సార్లు ఆ మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయం పై హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసులు చాలా సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తుంది. సబ్ డివిజన్ పరిధిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా టీచర్లతో పాటు ముగ్గురూ ఉపాధ్యాయులు అలాగే మరొక ప్రైవేట్ స్కూలు లో పనిచేసే ఉద్యోగి సహకారంతో ఆ మైనర్ బాలిక సమీప బంధువులు ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడినట్లు జోరుగా చర్చ జరుగుతుంది.

**మైనర్ బాలికపై అఘాయిత్యం ఘటనపై అనుమానాలు ఎన్నో.?**

హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలో జరిగిన మైనర్ బాలిక ఘటనపై ఒకవైపు పోలీసుల విచారణ కొనసాగుతుండగా బయట తెలుస్తున్న విషయాలు మరోలాగా ఉన్నాయి. ఆ అమ్మాయి చదువుతున్న పాఠశాల లో పని చేస్తున్న సిబ్బంది పాత్ర అనుమానస్పదంగా ఉంది. విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు టీచర్లు ఇలాంటి ఘటనలకు పాల్పడతారా అనేది ఒక సందేహం.? అదే నిజమైతే సుమారు 8 నెలల కాలంలో చాలాసార్లు అఘాయిత్యం జరిగిందని మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు ఎందుకు తెలపలేదు అనేది మరొక అనుమానం.? అంతేకాకుండా ఆ బాలిక సక్రమంగా పాఠశాలకు రావడం లేదని ఎన్నిసార్లు మందలించిన తన నుండి ఎలాంటి స్పందన లేదని తెలుస్తుంది.?

**కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తిపై అనుమానాలు.?**

మైనర్ బాలిక ఫోక్సో కేసు పై ప్రముఖంగా కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి పేరు ప్రముఖంగా వినబడుతుంది. ఆ మైనర్ బాలిక కుటుంబానికి అండగా ఉంటూ అతని సూచనలతోనే ఈ కేసుకు జీవం పోసినట్లు స్థానికంగా జోరుగా చర్చ జరుగుతుంది. ఫోక్సో కేసు నమోదు అయిన వారిలో నిజమైన దోషులు ఎంతమంది ఉన్నారు కావాలని ఎంతమంది పేరు ఇరికించారు అనే విషయంపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ జరిపితే నిజ నిజాలు బయటికి వస్తాయి. ఏదేమైనా ఈ విషయం హుజురాబాద్ సబ్ డివిజన్లో చర్చనీయాంశంగా మారింది.

# జగ్జీవన్ రామ్ అందించిన సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శం





**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 5 (నినాదం) :** భారత మాజీ ఉపప్రదాని డాక్టర్ బాబు జగ్జీవన్ రాం 119వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కంటేశ్వర్ కమాన్ వద్ద గల పాత అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులు బాబూ జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత అంబేద్కర్ భవన్ ఆవరణలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొని బాబు జగ్జీవన్ రాం చేసిన సేవలను కొనియాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రాం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రత్యేకించి యువతరం, విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భవిష్యత్తు కోసం, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జగ్జీవన్ రాం అందించిన సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు. మహనీయుల గొప్పతనాన్ని, వారు చేసిన కృషిని భావిత రాలకు తెలియజేస్తూ, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ప్రభుత్వం అధికారకంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, పూలే వంటి మహనీయుల కృషి ఫలితంగానే నేడు మనమంతా గౌరవప్రదమైన స్థితిలో జీవనాలు వెళ్లదీస్తున్నామని కలెక్టర్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారని, తాను చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు. ఆయన ఓ మేధావిగానే కాకుండా మంచి వక్తగా, మానవతా దృక్పథం కలిగిన నాయకుడిగా ప్రజాదరణ పొందారని అన్నారు. బీహార్ రాష్ట్రం పాట్నాలోని పది ఎకరాల విస్తీర్ణంతో కూడిన గాంధీ మైదానంలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రాం సభకు ఆదరణ దక్కకుండా చేసేందుకు ఆనాడు ఆయన రాజకీయ ప్రత్యర్థులు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయడం బాబు జగ్జీవన్ రాం కు ఉన్న ఆదరణకు నిదర్శనం అని అన్నారు. ఇలాంటి మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు తమ ప్రతిభను మెరుగు పర్చుకోవాలని పిలుపునిచ్చారు. మహనీయుల జీవిత విశేషాల గురించి తెలుసుకొని, వారి అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. జిల్లాలో వివిధ కుల సంఘాల వారు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అంకిత భావంతో కృషి చేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు మాట్లాడుతూ, దేశానికి ఎన్నో విధాలుగా సేవలందించిన మహనీయుడు బాబు జగ్జీవన్ రాం అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సాధారణ కుటుంబంలో జన్మించిన బాబు జగ్జీవన్ రాం బడుగు, బలహీన వర్గాలు రాజ్యాంగ ఫలాలు అందిపుచ్చుకుని అభివృద్ధి పథంలో పయనించాలనే సంకల్పంతో అహర హం శ్రమించారని అన్నారు. జగ్జీవన్ రాం సమాజంలో సమానత్వం కోసం పరితపించిన మహనీయుడని కొనియా డారు. జిల్లా సాంఘి క సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి రాజ్ గంగారాం, టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సుమన్, వివిధ శాఖల అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొని ఘనం గా నివాళులు అర్పించారు. ఇటీవలే మృతి చెందిన ప్రముఖ దళిత నేత సిద్దిరాములును ఈ కార్యక్రమం సందర్భంగా స్మరిస్తూ, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

# జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు ఐక్యంగా కృషి చేయాలి

**జయంతి సందర్భంగా ఘన నివాళులు**

**దళిత సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యం**

**జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




**కరీంనగర్, ఏప్రిల్ 5(నినాదం) :** జగ్జీవన్ రామ్ ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో ఏర్పాటు చేసిన విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, మహనీయుల ఆలోచనలను అనుసరించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఇండో-పాక్ యుద్ధ సమయంలో దేశాన్ని కరువు నుంచి రక్షించిన నేతగా జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. సమానత్వం కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దళితుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, గృహాలు, భూములు వంటి పథకాల ద్వారా వారికి మద్దతు అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికకు చట్టబద్ధత కల్పించడం వల్ల గ్రామీణాభివృద్ధి వేగవంతమైందన్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా అమలు అవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, జగ్జీవన్ రామ్ దేశానికి మూడు దశాబ్దాలపాటు కీలక సేవలు అందించిన మహనీయుడని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అణచివేత కేసుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు మహనీయుల స్ఫూర్తితో బలహీన వర్గాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అధ్యయన వేదిక విద్యార్థులు, సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అంతర కుల వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల (రెవెన్యూ) కలెక్టర్ లక్ష్మీ కిరణ్, కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్, జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# భారత దేశ జన గణనకు వేళాయే

*భారత్ దేశ రిజిస్టార్ జనరల్ మరియు జనాభా గణన కమిషనర్ తరపున పదహారేళ్ల తర్వాత మళ్లీ చేపట్టనున్న జనగణనకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్ దేశం లో 1872 నుండి జనాభా గణన నిర్వహిస్తున్నారు దేశం లో 16 వది మరియు స్వాతంత్రం తర్వాత 8 వ జనాభా గణన ఇది .తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటి జనాభా గణన ఇదే.సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు జనగణన కీలకం కావడంతో కేంద్రం కూడా ఇప్పటికే నియమ నిబంధనలు రూపొందించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణ అమలు చేయనున్నారు. మే 11 నుంచి క్షేత్రస్థాయి సమాచార సేకరణ చేయనున్నారు.*

ఎడిటోరియల్

దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అత్యంత కీలకమైన జనగణన-2027ను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనుండటంతో రాష్ట్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. రాష్ట్రంలో జనగణనను 2027 ఫిబ్రవరి నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో తొలిదశలో క్షేత్రస్థాయి సమాచార సేకరణను మే 11వ తేదీ నుంచి చేపట్టనుంది. గ్రామపంచాయతీలు ము నిసిపాలిటీల్లోనివార్డులో నగర పంచాయతీ కార్పోరేషన్స్ లో ఇళ్ల జాబితాలను తయారు చేసి, ఆ కుటుంబాల్లోని వారి జీవనస్థితిగతులను గుర్తించే ప్రక్రియను ప్రా రంభించను న్నారు. జనగణనను విజయ వంతం చేయడానికి ఆయా జిల్లాల ప్రధాన జనగణన అధికారిగా కలెక్టర్ ఆయన కు సహాయ ముఖ్య జిల్లా జనగణ న అధికారిగా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)వ్యవ హరించనున్నారు. వీరి ఆధ్వర్యంలో ఈ జనగణన తొలిదశ క్షేత్రస్థాయి గృహాల జాబితా రూపకల్పనకోసండివ విజన్ స్థాయిలో రెవెన్యూ డివిజనల్ అధికారులు జిలా ప్లానింగ్ అధికారి, డీపీవో, డీఎఫ్వో, జడ్పీ సీఈవో, డీఐసీ, ఎస్వో, డీఈవోతో కలిపి 10 మంది కి శిక్షణ ఇచ్చారు అధికారులు ఇళ్ల జాబితా, ఆ కుటుంబాల జీవనస్థితిగతుల నమోదునుజిల్లాలో అధికారులకు శిక్షణ ఇచ్చారు జనగణన తొలిదశ ఇళ్ల జాబితా రూపొందించడానికి చార్జీ అధికారులుగా బాధ్యతలు నిర్వహించే తహసీల్దార్లు, అదనపు చార్జ్ అధికారులు ఎంపీడీవోలకు చార్జీ క్లర్క్లుగా విధులు నిర్వహించే అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులు, సీనియర్ అసిస్టెంట్లకు ఇప్పటికే శిక్షణ పూర్తిచేశారు. గృహాల జాబితాను రూపొందించడానికి మ్యాపింగ్ రూపొందించడానికి టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లకు సూపర్వైజర్స్ కి శిక్షణ అం దించడానికి ఫీల్డ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని మార్చి 28 నుంచి 30వ తేదీ వరకు ఆయా జిల్లాల కలెక్టరేట్ లో పూర్తిచేశారు. ఈ ఫీల్డ్ ట్రైనర్లు ఏప్రిల్ మూడవ వారం లో ఎన్యుమరేటర్లకు సూపర్వైజర్లకు మండలాలవారీగా శిక్షణ అందించనున్నారు.జనగణన-2027 ప్రక్రియలో మే 11నుంచి తొలిదశ ప్రారంభం కానుంది. జూన్ 9వ తేదీ వరకు ఎన్యుమరేటర్లు సూపర్వైజర్స్ క్షేత్రస్థాయిలో సర్వేబాట పట్టనున్నారు. ఆయా గ్రామాలు, మునిసిపాలిటీల్లో నగరాల్లో ఎన్ని గృహాలు ఉన్నాయో.. గుర్తించి, ప్రాంతాలవారీగా చిత్ర పటాలను రూపొందిస్తారు. ఈ దశలో కుటుంబ పెద్దకు ఐడీ క్రియేట్ చేస్తారు. ఈ ఐడీ కింద కుటుంబ జీవన స్థితిగతులను గుర్తిస్తారు. 2027 ఫిబ్రవరిలో రెండో దశలో జనగణన సర్వే చేపడతారు. ఈ రెండో దశలో మాత్రమే కుటుంబంలోని ఇతర సభ్యుల వివరాలను నమోదుచేస్తారు. తొలి దశలో నివాస గృహంనేల ఏ రకమైంది. పై కప్పు గణన గృహ వాడుక తాగునీరు మరుగు దొడ్డి వంటకు ఉపయోగించే ఇంధనం వాహనాలు, ఆహారపు అలవాట్లతోపాటు 34రకాల ప్రశ్నలు ఉండనున్నాయి. ఈ సర్వేలో శాటిలైట్ అనుసంధానంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ఎక్కడా పెన్నూ, పేపర్ వాడకుండా పూర్తిగా డిజిటల్ పద్ధతిలోనే సేకరణ కొనసాగుతుంది. సెల్ఫోన్లో డౌన్లోడ్ చేసుకున్న యాప్లో ఈ సమాచారం నిక్షిప్తము చేస్తారు గ్రామపంచాయతీలు, పట్టణాలు నగరాలు మునిసిపాలిటీల్లో జనగణన సర్వే జరగనుంది. వీటి పరిధిలోని గృహాలను గుర్తించేందుకు క్షేత్రస్థాయి సర్వేలో పాల్గొనే ముఖ్యమైన ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేస్తున్నారు ప్రతీ 800 జనాభాకు ఒక ఎన్యుమరేటర్ అవసరమని భావిస్తున్నారు. ప్రతీ ఆరుగురు ఎన్యుమరేటర్లకు ఒక సూపర్వైజర్ను నియమించనున్నారు.గృహాల సంఖ్య పెరుగుదల ఆధారంగా జనాభాలో సైతం 20శాతం నుంచి 30 శాతం పెరిగే అవకాశాలు ఉన్నట్లు అంచనా.
1948 జనాభా గణన చట్టం ప్రకారం నిర్వహించే ఈ గణన లో ప్రతి అన్యూమరేటర్ సూపర్వైజర్ లకు ఇళ్లకు నెంబర్లు వేయడానికి ప్రశ్నలు అడగడానికి సెక్షన్ 8,9 ప్రకారం హక్కు ను కలిగి ఉంటారు సెక్షన్ 6d ప్రకారం స్వీయ గణన చట్ట బద్ధంగా అనుమతుంచబడుంది జనాభా గణన రికార్డ్స్ మరియు డేటా పూర్తిగా గోప్యం గా ఉంటుంది మంచి నమ్మకంతో చేపట్టిన చర్యలకు సెక్షన్ 15 బి ప్రకారం రక్షణ ఉంది కావున ఇల్ల గణన జన గణన ను విజయ వంతం చేద్దాం

**కామిడి సతీష్ రెడ్డి**
ఫీల్డ్ ట్రైనర్
జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా
9848445134



## ఎందుకో భయం !

వర్షం అంటే ఇష్టపడతావు..
చిరుజల్లులకు గొడుగు పడతావు !

సూర్యుడంటే ఇష్టం అంటావు..
ఎండ రాగానే నీడ వెతుకుతావు !

గాలి వీచడం ఇష్టం అంటావు..
ఇంటి కిటికీలను మూసేస్తావు !

చలికాలం సరదా అంటావు..
స్వెట్టర్, రగ్గు నిండా కప్పేస్తావు !

మనిషంటే ఇష్టం అంటావు..
మానవత్వం మరిచి పోయావు !

నేను నిన్ను ప్రేమిస్తున్నా అంటావు..
ఎందుకో భయం వేస్తోంది నాకు !

- మధుపాళీ, 9949700037

# లక్షలాది మందికి స్ఫూర్తి దాయకం... ఉప్పు సత్యాగ్రహం

## ఏప్రిల్ 6...ఉప్పు చట్టాలను ఉల్లంఘించిన దినం



తొమ్మిది దశాబ్దాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం.
1930 ఏప్రిల్ 6 న, ఉదయం 6:30 గంటలకు గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించినప్పుడు, ఇది కోట్లాది భారతీయులు బ్రిటిష ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనడానికి స్ఫూర్తి నిచ్చింది. ఉప్పు సత్యాగ్రహ ప్రచారం గాంధీ ప్రవచించిన సత్యాగ్రహ సూత్రాలపై ఆధార పడింది.1930 ప్రారంభంలో, బ్రిటిష పాలన నుండి భారత సార్వభౌమత్వాన్ని, స్వయం పాలననూ సాధించుకోవటానికి భారత జాతీయ కాంగ్రెస్, తన ప్రధాన వ్యూహంగా సత్యాగ్రహాన్ని ఎంచుకుంది. ప్రచారాన్ని నిర్వహించడానికి గాంధీని నియమించింది. 1882 బ్రిటిష ఉప్పు చట్టాన్ని గాంధీ తమ సత్యాగ్రహ మొదటి లక్ష్యంగా ఎంచుకున్నారు. ఉప్పు చట్టాలను భారీగా ఉల్లంఘించడానికి గాంధీ ఏప్రిల్ 6 ను ఎంచుకోవడానికి ఒక ప్రధాన కారణముంది. 1919 లో రౌలాట్ చట్టానికి వ్యతిరేకంగా జాతీయ సమ్మె తలపెట్టిన "నేషనల్ వీక్"లో మొదటి రోజు. గాంధీ, తన ప్రార్ధన సమావేశాలలోనూ పత్రికలతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ, ప్రకటనలు ఇస్తూ ప్రపంచ వ్యాప్తంగా మీడియాను ఈ మార్చ్ కోసం సిద్ధం చేశాడు. మార్చ్‌కు ముందు రోజు సాయంత్రపు ప్రార్థనలో గాంధీ చెప్పేది వినడానికి వేలాది మంది భారతీయులు సబర్మతికి చేరుకున్నారు. అమెరికన్ పత్రిక, ది నేషన్ ఇలా రాసింది: "గాంధీ ఇచ్చే పోరాట ప్రకటన వినడానికి 60,000 మంది ప్రజలు నది ఒడ్డున గుమిగూడారు. ఈ పోరాటపు పిలుపు బహుశా ఇప్పటి వరకు ఇచ్చిన పిలుపులన్నిటి లోకీ విలక్షణమైనది".
భారతదేశంలో బ్రిటిష పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. దీన్ని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ కూడా పిలుస్తారు. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ తీరం లోని దండి వద్ద ఉప్పు తయారు చేసాడు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించాడు.
దండి సత్యాగ్రహం లో మహాత్ముని తో కలిపి 80మంది పాల్గొన్నారు.
1. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ, గుజరాత్, 2. ప్యారేలాల్ నయ్యర్, పంజాబ్, 3. ఛగన్‌లాల్ నాథుభాయ్ జోషి, గుజరాత్, 4. పండిత నారాయణ్ మోరేశ్వర్ ఖరే మహారాష్ట్ర, 5. గంపత్‌రావ్ గోడ్సే మహారాష్ట్ర, 6.ప్రథ్వీరాజ్ లక్ష్మీదాస్ అషర్ గుజరాత్, 7.మహవీర్ గిరి 8. బాల్ దత్తాత్రేయ కాలేల్కర్ మహారాష్ట్ర, 9.జయంతి నాథూభాయ్ పరేఖ్ గుజరాత్, 10.రసిక్ దేశాయ్ గుజరాత్, 11. విఠల్ లీలాధర్ థక్కర్ గుజరాత్, 12. హరఖ్జీ రాంజీభాయ్‌గుజరాత్ 13. తన్సుఖ్ ప్రన్షంకర్ భట్టు గుజరాత్, 14. కాంతీలాల్ హరిలాల్ గంధి గుజరాత్, 15. ఛోటూభాయ్ ఖుషల్భాయ్ పటేల్ గుజరాత్, 16. వాల్జీభాయ్ గోవింద్‌జీ దేశాయ్ గుజరాత్,17. పన్నాలాల్ బలభాయ్ ఝువేరి గుజరాత్,18. అబ్బాస్ వర్తేజీ గుజరాత్, 19. పుంజాభాయ్ షా కూడా గుజరాత్, 20. మాధవ్‌జీ భాయ్ థక్కర్ గుజరాత్, 21. నరంజీభాయ్ గుజరాత్, 22. మగన్‌భాయ్ వోర గుజరాత్, 23. దుంగార్సీభాయ్ గుజరాత్, 24 . సోమాలాల్ ప్రాగ్జీభాయ్ పటేల్ గుజరాత్, 25. హస్ముఖ్‌రాం జకాబార్ గుజరాత్, 26. దౌడ్‌భాయ్ గుజరాత్,27. రాంజీభాయ్ వంకర్ గుజరాత్, 28.దినకర్‌రాయ్ పాండ్య గుజరాత్, 29. ద్వారకానాథ్ మహారాష్ట్ర, 30. గజానన్ ఖరే మహారాష్ట్ర, 31. జెథాలాల్ రూపారెల్ కచ్ గుజరాత్, 32. గోవింద్ హర్కరే మహారాష్ట్ర, 33. పాండురంగ్‌మహారాష్ట్ర, 34. వినాయక్ రావ్ ఆప్తే మహారాష్ట్ర, 35. రాంతీర్థ్ రాయ్యు నైటెడ్ ప్రావిన్సెస్, 36. భానుశంకర్ దవే గుజరాత్, 37. మున్షిలాల్, 38.రాఘవన్ కేరళ,39. రవ్జీభాయ్ నాథలాల్ పటేల్ గుజరాత్, 40. శివభాయ్ గొఖల్భాయ్ పటేల్ గుజరాత్, 41. శంకర్భాయ్ భీకాభాయ్ పటేల్ గుజరాత్,42. జష్భాయ్ ఇష్వర్భాయ్ పటేల్ గుజరాత్, 43. సుమంగళ్ ప్రకాశ్ 44. థేవర్ తుండియిల్ టైటస్కే రళ, 45. కృష్ణ నాయర్ కేరళ, 46. తపన్ నైర్ కేరళ, 47. హరిదాస్ వర్జీవందాస్ గాంధీ గుజరాత్, 48.చిమన్లాల్ నర్సిలాల్ షహ్ గుజరాత్, 49.షంకరన్ కేరళ, 50. సుబ్రహ్మణ్యం ఆంధ్రప్రదేశ్, 51. రామనిక్లాల్ మగన్లాల్ మొది గుజరాత్, 52. మదన్ మోహన్ చతుర్వేది రాజస్థాన్, 53. హరిలాల్ మహింతుర మహారాష్ట్ర, 54. మోతీబస్ దాస్ ఒడిశా, 55.హరిదాస్ మజుందార్ గుజరాత్, 56. ఆనంద్ హింగోరిని సింధ్, 57. మహదేవ్ మార్తాండ్ కర్ణాటక, 58.జయంతిప్రసాద్ యునైటెడ్ ప్రావిన్సెస్, 59. హరిప్రసాద్ యునైటెడ్ ప్రావిన్సెస్, 60.అనుగ్రహ్ నారాయణ్ సిన్హా బీహార్, 61.కేశవ్ చిత్రే మహారాష్ట్ర, 62. అంబలాల్ శంకర్భాయ్ పటేల్ గుజరాత్, 63. విష్ణు పంత్ మహారాష్ట్ర, 64. ప్రేంరాజ్ పంజాబ్, 65.దుర్గేష్ చంద్ర దాస్ బెంగాల్, 66. మాధవ్‌లాల్ షా గుజరాత్, 67. జ్యోతిరాం 68. సూరజ్‌భాన్ పంజాబ్, 69.భైరవ్ దత్, 70. లాల్జీ పర్మర్ గుజరాత్, 71.రత్నజీ బోరీ గుజరాత్, 72. విష్ణు శర్మ మహారాష్ట్ర, 73.చింతామణి శాస్త్రి మహారాష్ట్ర, 74. నారాయణ్ దత్, రాజస్థాన్, 75. మనిలాల్ మోహందాస్ గాంధీ గుజరాత్, 76. సురెంద్ర, 77. హరి కృష్ణ మొహొని మహారాష్ట్ర, 78. పురతన్ బుచ్ గుజరాత్, 79. ఖరగ్ బహదూర్ సింఘ్ గిరి నేపాల్ సంస్థానం, 80. శ్రీ జగత్ నారాయణ్ ఉత్తర ప్రదేశ్.
ప్రసిద్ధ దండి యాత్రలో పాల్గొన్న ఈ సత్యాగ్రహులను గౌరవిస్తూ ఐఐటి బొంబాయి ఆవరణలో ఒక స్మారక చిహ్నాన్ని రూపొందించారు.

ఏప్రిల్ 6 ఉదయం, ప్రార్ధన తరువాత, గాంధీ ఉప్పు బురదను పైకి లేపి, "దీనితో, నేను బ్రిటిష సామ్రాజ్యపు పునాదులను కదిలిస్తున్నాను" అని ప్రకటించాడు. తరువాత ఆయన దానిని సముద్రపు నీటిలో ఉడకబెట్టి, బ్రిటిష చట్టాన్ని ధిక్కరిస్తూ ఉప్పును తయారు చేశాడు. తన వేలాది మంది అనుచరులను కూడా అదేవిధంగా సముద్ర తీరం వెంబడి "ఎక్కడ వీలుగా ఉంటే అక్కడ" ఉప్పును తయారు చేయమని చెప్పాడు. గ్రామస్థులను కూడా ఉప్పును తయారు చేయమని చెప్పమని కూడా వారిని కోరాడు. ఇలా 79మందితో మహాత్ముడు ఈ కార్యక్రమం ప్రాంభించగా, సాధారణంగా గాంధీ కార్యక్రమాలలో జనసమూహాన్ని తగ్గించి రాసే అధికారిక ప్రభుత్వ వార్తాపత్రిక ది స్టేట్స్‌మన్, సబర్మతి – అహ్మదాబాద్ రహదారిపై 1,00,000 మంది ప్రజలు ఉన్నారని పేర్కొనడం గమనార్హం.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

# క్రీడలతో సమానత్వ సాధన, అడ్డంకులను అధిగమించే వేదికలు

## (06 ఏప్రిల్ "అభివృద్ధి, శాంతి స్థాపనకు క్రీడల అంతర్జాతీయ దినం" సందర్భంగా)

క్రీడలు శారీరక పటుత్వం, అవయవ సమన్వయం, మానసిక వికాసాలను కూర్చే సరదా క్రియలు. ఆటలు మానసిక ఉల్లాస లోగిళ్లు. క్రీడలు గెలుపోటములను పరిచయం చేసే క్రియలు. క్రీడా స్ఫూర్తిని నింపగలిగే క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో శిశు దశ నుంచే ప్రారంభం అవుతాయి. నేడు క్రీడారంగం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సమన్వయ సహకార అవగాహనకు నెలవులుగా విశేష కృషి చేస్తున్నాయి. క్రీడల్లో కుల మత వర్ణ వర్గ జాతి విభేదాలకు తావు ఉండదు. క్రీడామైదానాలు సమైక్యతకు ఊతం ఇస్తున్నాయి. క్రీడలతో సరిహద్దులు చెరపబడుతున్నాయి. క్రీడలు మానవజాతికి వినోద కేంద్రాలుగా సేవలు చేస్తున్నాయి. దేశాల మధ్య వారసులుగా క్రీడలు ఉపకరిస్తున్నాయి. సహనం, పట్టుదల, నైపుణ్యం, దేహదారుఢ్యం, గౌరవం, కీర్తి ప్రతిష్టలు, శారీరక సమన్వయం, అభివృద్ధి, శాంతి, ఆశావహ దృక్పథం, క్రీడా స్ఫూర్తి నింపడం, శారీరక మానసిక ఆరోగ్యం లాంటి అనేక అంశాల్లో దోహదపడుతున్న క్రీడలు అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలను కల్పిస్తూనే ఉన్నాయి.

**అభివృద్ధి, శాంతి స్థాపనకు క్రీడల అంతర్జాతీయ దినం-2026:**
క్రీడల్లో అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు కూడా సమాన అవకాశాలు కల్పించడంతో పాటు దేశాభివృద్ధికి, విశ్వ శాంతికి ఊతం ఇవ్వడానికి ఐరాస చొరవతో 2014 నుంచి ప్రతి ఏట 06 ఏప్రిల్ "అభివృద్ధి, శాంతి స్థాపనకు క్రీడల అంతర్జాతీయ దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. ఆరోగ్యకర పౌర సమాజ స్థాపన సుసాధ్యం కావడంతో దేశాభివృద్ధికి మానవ శక్తియుక్తులు సదా ఉపయోగపడుతూనే ఉన్నాయి. అభివృద్ధి, శాంతి స్థాపన కోరుతూ క్రీడలను ప్రోత్సహించడం, క్రీడాకారులను గుర్తించడం, లింగ సమానత్వం సాధించడం, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, క్రీడల విలక్షణ అనువర్తనాలను అవగాహన పరచడానికి పాటిస్తున్న అభివృద్ధి, శాంతి స్థాపనకు క్రీడల అంతర్జాతీయ దినం–2026 ఇతివృత్తంగా "క్రీడలు : వారధి నిర్మాణాలు, అడ్డంకులను బద్దలు కొట్టడం (స్పోర్ట్ : బిల్డింగ్ బ్రిడ్జెస్, బ్రేకింగ్ బ్యారియర్స్) " అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తూ ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదపడుతున్నాయి. అత్యంత చవకైన క్రీడల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఆకర్షణీయ ఆదాయ జీవితాలు, పేరు ప్రఖ్యాతులు, సమాజ గౌరవాలు, ఉద్యోగ ఉపాధులు ఆహ్వానిస్తున్నాయి. క్రీడా స్ఫూర్తి నిండిన మనసులు శాంతి మార్గాలను అనుసరిస్తారు. క్రీడలు విలసిల్లిన దేశాల్లో పేదరికం తగ్గుతూ శాంతియుత సహకార భావనలు చిగురిస్తాయి. క్రీడలతో మానవ హక్కుల పరిరక్షణ, ఆర్థిక ప్రగతి, సామాజిక ఉన్నతి, సమాజ ఐక్యత, వాతావరణ సానుకూల మార్పులు, సమగ్రాభివృద్ధి, మహిళా సాధికారత, సమ్మిళిత అభివృద్ధి తప్పనిసరిగా సుసాధ్యం అవుతాయని గమనించి ముందుకు సాగుదాం, క్రీడాకారులుగా లేదా క్రీడాభిమానులుగా అభివృద్ధి, శాంతి స్థాపనకు సహకరిద్దాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# సంప్రదాయం +సాంకేతికత =అద్భుత అవధానం

## డిజిటల్ వేదికపై శరత్ కుమార్ మేధో విలాసం

### ధర్మపురి పాండిత్య వైభవం: అవధాన ప్రక్రియలో నూతన శకం - వొజ్ఝల శరత్ కుమార్ సాహిత్య ప్రస్థానం

**తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లాలో, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసిన ధర్మపురి క్షేత్రం అనాదిగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, శాస్త్రీయ సంపదలకు నిలయంగా భాసిల్లుతోంది. దక్షిణ భారతదేశం లోని అత్యంత ప్రాచీన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రం, కేవలం భక్తి పరంపరలకే కాక వేద వేదాంగాలు, శాస్త్రాగమాలు, సాహిత్య కళలకు పుట్టినిల్లుగా నిలిచింది. క్రీస్తుశకం 9వ శతాబ్దం నుంచే ఈ ప్రాంతం విద్యాభ్యాసానికి, విశేష వేదాధ్యయనాలకు కేంద్రంగా విలసిల్లిందనడానికి ఇక్కడి శాసనాధారాలు, స్థానిక వంశావళులు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.**



కాళేశ్వరం, వేములవాడ, బాసర వంటి ప్రసిద్ధ క్షేత్రాల సరసన ధర్మపురిని కూడా చేర్చి, పండితులు దీనిని "త్రిభుజ తపోభూమి"గా అభివర్ణించడం ఈ నేల యొక్క విశిష్టతను చాటిచెబుతోంది. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కొలువుదీరిన ఈ పుణ్యధామంలో అర్చక సంప్రదాయాలు, యక్షగాన ప్రదర్శనలు, హరికథా కాలక్షేపాలు ఒకదానితో ఒకటి మిళితమై ఒక అద్భుతమైన సాంస్కృతిక సమన్వయాన్ని ఆవిష్కరిస్తున్నాయి. తరతరాలుగా ఇక్కడ కొనసాగుతున్న విద్యా పరంపరలో సంస్కృతం, తెలుగు, ప్రాకృత భాషల్లో నిష్ణాతులైన పండితులు ధర్మపురిని ఒక "విద్యా క్షేత్రం"గా తీర్చిదిద్దారు. కాలక్రమేణా ఆధునిక విద్యా వ్యవస్థలు ప్రవేశించినప్పటికీ, సంప్రదాయ విద్యా మూలాలను, ఆ ప్రాచీన పాండిత్య గరిమను కాపాడుకుంటూ రావడం ఈ క్షేత్రానికున్న ప్రత్యేక గౌరవం.
ఈ మహోన్నత పాండిత్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని, ఆధునిక కాలంలో ధర్మపురి గడ్డపై ఉద్భవించిన అద్భుత ప్రతిభావంతుడు డాక్టర్ వొజ్ఝల శరత్ కుమార్ తన అనన్య సామాన్యమైన ప్రతిభతో సంస్కృతం, తెలుగు, ఆంగ్ల భాషల్లో సమానమైన పట్టు సాధించి "త్రిభాషా కవి"గా గుర్తింపు పొందారు. ప్రాచీన ఛందస్సాహిత్యంపై దృఢమైన పట్టు కలిగి ఉంటూనే, ఆధునిక భావ వ్యక్తీకరణలో తనదైన ముద్ర వేయడం డాక్టర్ శరత్ కుమార్ ప్రత్యేకత. ఆయన రచించిన శతకాలు సాహిత్య లోకంలో విశేష ప్రశంసలు అందుకోవడమే కాకుండా, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆయనను ఒక శక్తివంతమైన కవిగా నిలబెట్టాయి. భక్తి, నైతికత, సామాజిక స్పృహ కలగలిసిన ఆయన కవిత్వం పండిత పామరులను అలరిస్తోంది.
తెలుగు సాహిత్య ప్రక్రియల్లో అత్యంత కఠినమైనది, మేధోపరమైనది అయిన 'అవధానం'లో డాక్టర్ శరత్ కుమార్ ప్రవేశించడం ధర్మపురి సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచి పోతుంది. శ్రీ నారాయణీ అవధాన వేదిక ద్వారా నిర్వహించబడిన డాక్టర్ వొజ్ఝల శరత్ కుమార్ ప్రథమ అష్టావధానం అటు సంప్రదాయాన్ని, ఇటు ఆధునిక సాంకేతికతను మేళవించి సాహిత్య లోకానికి కొత్త వెలుగును పంచింది. ఈ కార్యక్రమానికి సంచాలకులుగా గణపతి అశోక్ శర్మ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా ముద్దు రాజయ్య వ్యవహరించారు. విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి సభా నిర్వహణ బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా చేపట్టి కార్యక్రమ జయప్రదానికి తోడ్పడ్డారు. జూమ్ యాప్ వంటి డిజిటల్ మాధ్యమం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించబడిన ఈ అవధానంలో పృచ్ఛకులుగా ఉద్దండ పండితులు పాల్గొని అవధాని మేధస్సుకు పదును పెట్టారు. నిషిద్ధాక్షరిలో మాచవోలు శ్రీధర్ రావు సంధించిన అక్షర అడ్డంకులను శరత్ కుమార్ చాకచక్యంగా అధిగమించగా, దత్తపదిలో చంద్రశేఖర్ శర్మ ఇచ్చిన క్లిష్ట పదాలను ఛందస్సులో ఇముడ్చుతూ అద్భుతమైన పద్య రచన చేశారు. సమస్య పూరణలో ఈమని మల్లికార్జున రావు విసిరిన వైచిత్రిని సమయ స్ఫూర్తితో పూరించి సభికులను మంత్రముగ్ధులను చేశారు. వర్ణనలో పి.యల్. నాగేశ్వర రావు కోరిన అంశాలను అత్యంత రమణీయంగా చిత్రించగా, న్యస్తాక్షరిలో కౌండిన్య నందూరి వేంకటేశ్వర రాజు సూచనల మేరకు అక్షర విన్యాసాన్ని ప్రదర్శించి తన ధారణా శక్తిని చాటుకున్నారు. మాల్యాల సోమేశ్వర రావు కోరిన ఆశు కవిత్వంలో ధారాశుద్ధిని, విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి నిర్వహించిన పురాణ పఠనంలో పాండిత్యాన్ని ప్రకటిస్తూ అవధాని సాగించిన ప్రయాణం తొలి సారి అయినా అది అద్వితీయం. వీటన్నింటి మధ్య దుర్గి శ్రవణ్ కుమార శర్మ అప్రస్తుత ప్రసంగం సభలో హాస్యపు జల్లులు కురిపిస్తూ ఆహ్లాదాన్ని నింపింది.
ఈ అష్టావధానం కేవలం కవితా శక్తికి మాత్రమే పరిమితం కాకుండా, ఏకకాలంలో అనేక అంశాలపై దృష్టి సారించగలిగే ఏకాగ్రతను, అమోఘమైన ధారణా శక్తిని, సమయస్ఫూర్తిని, శబ్ద నైపుణ్యాన్ని ఆవిష్కరించింది. డిజిటల్ యుగంలో సంప్రదాయ కళలు అంతరించిపోతాయన్న భయాలను పటాపంచలు చేస్తూ, సాంకేతికతను సాహిత్య వ్యాప్తికి ఎలా ఉపయోగించుకోవచ్చో శరత్ కుమార్ నిరూపించారు.
ధర్మపురి పుణ్యక్షేత్ర చరిత్రలో వేద పండితులు, శాస్త్ర కోవిదులు ఎందరో ఉన్నప్పటికీ, ఆధునిక కాలంలో ఈ క్షేత్రం నుండి అవధానిగా ఎదిగిన తొలి వ్యక్తిగా డాక్టర్ వొజ్ఝల శరత్ కుమార్ పేరు సువర్ణాక్షరాలతో లిఖించ దగినది. ఈ విజయం స్థానిక యువతకు, విద్యార్థులకు ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తోంది. తెలుగు భాషా సాహిత్యాలకు ప్రాభవం తగ్గుతోందన్న ఆందోళన ఉన్న తరుణంలో, శరత్ కుమార్ వంటి యువకులు అవధాన కళను భుజానికెత్తుకోవడం శుభపరిణామం. ఆయన రచనల్లో కనిపించే సాహిత్య విలువలు, సామాజిక సందేశాలు నేటి తరం యువతకు దిక్సూచిగా మారుతున్నాయి. ప్రాచీన సంప్రదాయాన్ని గౌరవిస్తూనే, ఆధునిక పోకడలను ఆహ్వానించే ఆయన దృక్పథం సాహిత్య రంగంలో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.
సంప్రదాయం మరియు ఆధునికతల ఈ అరుదైన సంగమం ధర్మపురి క్షేత్రానికి నూతన శోభను చేకూరుస్తోంది. వేదాల హోరు, గోదావరి జలాల జోరుతో పునీతమైన ఈ నేల, ఇప్పుడు అవధాన పద్యాల హోయలుతో పులకించి పోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రపంచ పటంలో నిలబెట్టడానికి సంకల్పం, సాధన ఉంటే సరిపోతుందని ఈ యువ అవధాని నిరూపించారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని గొప్ప సాహిత్య విజయాలు సాధించి, తెలుగు భాషా కీర్తిని దశదిశలా వ్యాపింప జేయాలని, ఆయన స్ఫూర్తితో మరిన్ని ప్రతిభావంతమైన మస్తిష్కాలు ధర్మపురి నేల నుండి ఉద్భవించాలని ఆశిద్దాం. పాతను గౌరవిస్తూ కొత్తను ఆహ్వానించే ఈ సాహిత్య ప్రయాణం నిరంతరాయంగా సాగి, తెలుగు సాహిత్య వైభవం కలకాలం వర్ధిల్లాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494



ఇది కేవలం రుచికరమైనది మాత్రమే కాదు, మన ఇంట్లో నిత్యం అందుబాటులో ఉండే కూరగాయలతో చేసేది కాబట్టి చాలా ఆరోగ్యకరమైనది కూడా. హోటల్ తరహా రుచిని ఇంట్లోనే పది నిమిషాల్లో తీసుకురావచ్చు. అటు అల్పాహారంగా, ఇటు సాయంత్రం స్నాక్ లాగా లేదా ఆఫీస్ లంచ్ బాక్స్ లోకి కూడా ఇది ఒక పర్ఫెక్ట్ ఛాయిస్. మరి ఈ క్రీమీ అండ్ స్పైసీ రోల్ ఎలా తయారు చేయాలో ఇప్పుడు వివరంగా చూద్దాం.

## బ్రేక్ ఫాస్ట్‌లోకి అదిరిపోయే
# 'మసాలా చపాతీ రోల్'!



**కావలసిన పదార్థాలు:**
మెత్తటి చపాతీలు -2 లేదా 3
ఉల్లిపాయ - 1 (సన్నగా తరిగినవి)
క్యారెట్, క్యాబేజీ, క్యాప్సికమ్ - తగినంత (సన్నని ముక్కలు)
ఉడికించిన బంగాళదుంప లేదా పనీర్ ముక్కలు - 1 కప్పు
అల్లం-వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్
పసుపు -- చిటికెడు
కారం - 1 టీస్పూన్
గరం మసాలా, చాట్ మసాలా - - తగినంత
ఉప్పు - రుచికి సరిపడా
నూనె - 2 టేబుల్ స్పూన్లు
జీలకర్ర - అర టీస్పూన్
టమాటా సాస్ లేదా గ్రీన్ చట్నీ - - పూయడానికి
కొత్తిమీర - కొద్దిగా

**తయారీ విధానం:**
మొదటగా ఒక బాణలిలో నూనె వేడి చేసి జీలకర్ర వేయాలి. ఆ తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు తరిగి పెట్టుకున్న క్యారెట్, క్యాబేజీ, క్యాప్సికమ్ ముక్కలను వేసి కొద్దిసేపు మగ్గనివ్వాలి. కూరగాయలు మరీ మెత్తగా అవ్వకుండా కొంచెం క్రంచీగా ఉంటేనే రోల్ రుచిగా ఉంటుంది.

కూరగాయలు వేగిన తర్వాత పసుపు, కారం, గరం మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. చివరగా ఉడికించిన బంగాళదుంప ముక్కలు లేదా పనీర్ ముక్కలు వేసి మసాలా అంతా పట్టేలా కలిపి కొత్తిమీర చల్లుకోవాలి. ఇప్పుడు సిద్ధంగా ఉన్న చపాతీని తీసుకుని దానిపై టమాటా సాస్ లేదా గ్రీన్ చట్నీని సమానంగా పూయాలి. మధ్యలో మనం తయారు చేసుకున్న మసాలా మిశ్రమాన్ని ఉంచి చపాతీని రోల్‌లా చుట్టాలి.

**రుచి పెంచే చిన్న చిట్కాలు:**
మీరు దీనిని మరింత స్పెషల్ గా చేయాలనుకుంటే లోపల కొద్దిగా చీజ్ తురుము వేయవచ్చు, ఇది పిల్లలకు చాలా ఇష్టం. అలాగే పనీర్ లేదా చికెన్ ముక్కలను జోడించడం వల్ల ప్రోటీన్ కూడా లభిస్తుంది. సర్వ్ చేసేటప్పుడు రోల్‌ను టిష్యూ పేపర్ లేదా అల్యూమినియం ఫాయిల్‌లో చుడితే తినడానికి సౌకర్యంగా ఉంటుంది.



# ఆధునిక హైదరాబాద్ వాస్తు శిల్పి 7వ నిజాం
## చివరి నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ జయంతి


**మీర్ ఉస్మాన్ అలీఖాన్...భాగ్యనగరంలో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం ఉన్న పాలకుడు. కొందరు ఆయనను ద్వేషించినా, మరి కొందరు ప్రేమించినా, ఆయన హైదరాబాద్ అభివృద్ధికి చేసిన కృషిని అందరూ అభినందించక తప్పదు. కొందరు ఆయన్ను సంకుచిత మనస్తత్వం గలిగిన, కొందరు మతతత్వం గలిగిన పాలకునిగా, మరికొందరు అతన్ని దుర్మార్గుడు అని భావించినా, ఆధునిక హైదరాబాద్ వాస్తుశిల్పిగా, నిర్మాతగా ఆయన జ్ఞాపకం ఉండక మానదు. ప్రణాళికా బద్ధమైన నగరాన్ని అభివృద్ధి చేయడంలో తన దృష్టిని అమోఘం. కృషి అనన్య సామాన్యం. హైదరాబాద్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కట్టెదుట కనిపించే ఆయన పోషించిన పాత్రను ఎవ్వరూ కాదన లేని వాస్తవం.**

ఉస్మాన్ ఆలీ ఖాన్ (ఏప్రిల్ 6, 1886 – ఫిబ్రవరి 24, 1967) మహబూబ్ ఆలీ ఖాన్ రెండవ కుమారుడు. క్రీ.శ. 1911లో నిజాం మరణించడంతో ఏడవ అసఫ్ జా బిరుదుతో నైజాం పదవిని అలంకరించాడు. ఈయనే అసఫ్ జాహీ పాలకులలో చివరివాడు. పూర్తి పేరు " ఫతే జంగ్ నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసఫ్ ఝా. టైమ్ పత్రిక 1937 సంవత్సరం నిజాంను ప్రపంచంలోని అత్యంత ధనవంతునిగా ప్రచురించింది.1947 ఆగస్టు 15న భారత దేశం స్వాతంత్ర్యం పొందిన అనంతరం హైదరాబాదును స్వతంత్ర రాజ్యం చేయడానికి నిజాం ప్రయత్నించగా, నిజాంతో అనేక సంప్రదింపులు జరిపిన ప్రభుత్వం చివరకు సెప్టెంబరు 13, 1948న ఆపరేషన్ పోలో పేరుతో సైనిక చర్య జరిపి హైదరాబాదు సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేసింది. 1956లో జరిగిన భాషా ప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వలన నిజాం రాజ ప్రముఖ్ పదవి కోల్పోయాడు. ఆయన 1967 సంవత్సర ఫిబ్రవరి 24 తేదీన మరణించాడు.

జమిందార్లు, చిన్న గడీదారులు, దొరలు, తాబేదారులు, నిజాం నవాబుకు కప్పం చెలించే వారు కప్పం ద్వారా వచ్చిన ఆదాయంతో ఎన్నో కట్టడాలు నిజాం నవాబులు నిర్మించారు. అలా నిర్మించిన వాటిల్లో పేర్కొన తగినవి...
చిరాన్ ప్యాలెస్... హైదరాబాదు లోని కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ వనంలో 1940లో నిర్మించబడిన చిరాన్ ప్యాలెస్, 400 ఎకరాల్లో విస్తరించి ఉంది.
తెలంగాణ హైకోర్టు...1920, ఏప్రిల్ 20న తెలంగాణ హైకోర్టు ప్రారంభించ బడింది.
రాజ్‌భవన్... సోమాజీగూడ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భవనం ఈ రాజ్‌భవన్. ఇది రాష్ట్ర గవర్నరు అధికారిక నివాసంగా ఉపయోగ పడుతుంది. ఆజా ఖానా ఎ జెహ్రా... మూసీ నది తీరంలో ఆజా ఖానా ఎ జెహ్రా అనే ప్రార్థన మందిరం ఉంది.

నిజాం సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 1918 వ సంవత్సరంలో స్థాపించబడింది. ఇది భారతదేశంలో అతిపెద్ద విశ్వవిద్యాలయాలలో ఒకటిగా. ప్రాథమిక విద్య తప్పనిసరి చేసింది, పేదలకు ఉచితంగా విద్య అందించారు. సిర్పూరు పేపరు మిల్స్, బోధన్ చక్కెర ఫాక్టరీ, అజంజాహీ నూలు మిల్లులు, చార్మినార్ సిగరెట్ ఫాక్టరీ మొదలైన కర్మాగారాలు నెలకొల్ప బడినవి. నిజాం స్టేట్ రైల్వే నెలకొల్ప బడింది.

1965 లో, నిజాం భారత్ చైనా యుద్ధం 1962 సమయంలో 5000





కిలోల బంగారంన్ని యుద్ధ నిధికి అందించాడు.

నిజాం హిందువులు, ముస్లింలను తన రెండు కళ్ళుగా భావించి, అనేక దేవాలయాల పురోగతి కోసం అనేక సార్లు బంగారు, డబ్బుని విరాళంగా ఇచ్చాడు.

నిజాం రాష్ట్ర రికార్డును పరిశీలిస్తే, మీర్ ఉస్మాన్ అలీఖాన్ 82,825 లను యడ్డిగుట్ట ఆలయానికి, 50,000 రూపాయల భద్రాచలం ఆలయం, 80 వేల రూపాయలకు తిరుపతి వెంకటేశ్వర ఆలయానికి దానం చేశాడని తెలుస్తున్నది.

1932 సంవత్సరంలో, భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (పూణే), హిందూ "మహాభారతం" సంకలనం మరియు ప్రచురణకు, అలాగే "నిజాం గెస్ట్ హౌస్" గా పిలువబడే అతిథికి 50,000 రూపాయలు అందించినట్లు పేర్కొన బడింది.

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1967 ఫిబ్రవరి 24 న కింగ్ కోఠి ప్యాలెస్లో మరణించాడు.

నిజాం అంత్యక్రియల ఘట్టం భారత చరిత్రలోనే అతి పెద్దదిగా, 10 మిలియన్ ప్రజలు నిజాం ఊరేగింపులో పాల్గొన్నట్లు భావించ బడుతున్నది.



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో
# తెలుగు వారి భాగస్వామ్యం
## ఏప్రిల్ 6...ఉప్పు చట్టాలను ఉల్లంఘించిన దినం

తొమ్మిది దశాబ్దాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం.

భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిష పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లించేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేపట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరేకించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు.

1920 – 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది.


ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు.

ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో



ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి.

ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజులకు ముందే బ్రిటిష్ వారు గాంధీని



మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు.


ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు.

నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యాగ్రహం సమయం లోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశ ద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లంఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసుకున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**








## పొద్దుతిరుగుడు పువ్వు నూనె
# విక్రయాలు 10% తగ్గొచ్చు
## అధిక ధర, సరఫరా అంతరాయాల ప్రభావం వల్లే 2026-27పై క్రిసిల్ రేటింగ్స్ అంచనా

**ముంబయి:** పశ్చిమాసియా ఉద్రికత్తల పరిణామాల ఫలితంగా మన దేశంలో శుద్ధి చేసిన (రిఫైన్డ్) పొద్దుతిరుగుడు పువ్వు (సన్‌ఫ్లవర్) నూనె విక్రయాల పరిమాణం ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో 10% తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. సరఫరా అంతరాయాలకు తోడు, పెరుగుతున్న ధరల నేపథ్యంలో, చౌకైన ప్రత్యామ్నాయ నూనెల వైపు వినియోగదార్లు మారుతుండటంతో.. గిరాకీ తగ్గి విక్రయాల పరిమాణం తగ్గుతుందని పేర్కొంది. సంస్థ నివేదిక ప్రకారం..

మనదేశంలో వార్షిక వంట నూనె వినియోగం 25-26 మిలియన్ టన్నులు కాగా, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు పువ్వు నూనె వాటా ఇందులో 12-14 శాతంగా



ఉంది. మనదేశానికి రష్యా, ఉక్రెయిన్, అర్జెంటైనా నుంచి ఈ నూనె ఎక్కువగా దిగుమతి అవుతోంది.
పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు, ఈ ముడినూనె 12 నెలల సగటు దిగుమతి ధర టన్నుకు 1,275 డాలర్లు కాగా ప్రస్తుతం 1,420-1,440 డాలర్లకు పెరిగింది.
డాలర్‌తో పోలిస్తే బలహీనపడుతున్న రూపాయి, అధిక రవాణా ఖర్చులు మన దేశంలో ముడి పొద్దుతిరుగుడు పువ్వు నూనె దిగుమతి వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. దీంతో నూనె ధరలు పెరిగాయి. దీంతో వినియోగదార్లు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. పొద్దుతిరుగుడు పువ్వు ముడి నూనె ధర పెరగడం వల్ల, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు పువ్వు నూనె చిల్లర ధరలు కూడా పెరిగాయి. 2026 జనవరిలో లీటరు రూ.150 ఉండగా, ప్రస్తుతం ఈ నూనె లీటరుకు రూ.170-175గా ఉంది. ప్రస్తుతం పొద్దుతిరుగుడు పువ్వు నూనెతో పోలిస్తే బియ్యపు తవుడు, సోయాబీన్ నూనెలు లీటరుకు రూ.10-20 తక్కువకే లభిస్తున్నందున, ఈ ప్రత్యామ్నాయాల వైపు కొందరు మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది.

## హ్యుందాయ్ ఆఫర్స్.. ఈ కారుపై 1.10 లక్షల వరకు ప్రయోజనాలు!




ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా ఏప్రిల్ నెలకు సంబంధించి ఆఫర్లను ప్రకటించింది. హ్యాచ్‌బ్యాక్, సెడాన్, ఎస్‌యూవీ, ఈవీ వాహన శ్రేణిపై భారీగా డిస్కౌంట్‌ను అందిస్తోంది. కొన్ని కార్లపై రూ.1.10 లక్షల వరకు ప్రయోజనాలను అందిస్తోంది. కారు మోడల్, వేరియంట్, ఎక్స్ఛేంజ్ ఎలిజిబిలిటీ బట్టి ఈ తగ్గింపు ఉంటుంది. ఇందులో క్యాష్ డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ సపోర్ట్, అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్, కార్పొరేట్ బెనిఫిట్స్, రూరల్ ఇన్సెంటివ్స్ రూపంలో ప్రయోజనాలు లభిస్తాయి.

సిటీ ఫ్రెండ్లీ హ్యాచ్‌బ్యాక్ ఐ10 నియోస్ హైయర్ ట్రిమ్స్‌పై రూ.68వేలు వరకు ప్రయోజనాలను అందిస్తోంది.
డిజైర్‌కు పోటీగా హ్యుందాయ్ నుంచి వచ్చిన ఆరాపై రూ.20 వేల వరకు ప్రయోజనాలను అందిస్తోంది.
ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఐ20పై రూ.58వేలు వరకు ప్రయోజనాలను ఆఫర్ చేస్తోంది.
ఎస్‌యూవీ మోడల్ ఎక్స్టర్ పాత స్టాక్‌పై రూ.43 వేలు, కొత్త ట్రిమ్స్‌పై రూ.5 వేల వరకు ప్రయోజనాలు లభిస్తాయి.
ఎక్కువగా అమ్ముడయ్యే కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ అయిన వెన్యూపై రూ.5 వేల వరకు ప్రయోజనాలను అందిస్తున్నట్లు హ్యుందాయ్ తెలిపింది.
పాత స్టాక్ హ్యుందాయ్ వెర్నా ఐవీటీ ట్రిమ్స్‌పై రూ.1.10 లక్షల వరకు .
క్రెటా, ఎన్‌లైన్ వేరియంట్స్‌పై రూ.55వేలు, క్రెటా ఎలక్ట్రిక్ వేరియంట్‌పై రూ.1 లక్ష వరకు .
అల్కజార్ పెట్రోల్ వేరియంట్‌పై రూ.70 వేలు, డీజిల్ వేరియంట్‌పై రూ.30 వేల వరకు .

## రూ.1.5 లక్షల కోట్లకు
# వీసీ పెట్టుబడులు

**ఢిల్లీ:** ప్రైవేట్ క్యాపిటల్ మార్కెట్లలో ప్రపంచవ్యాప్తంగా మందగమనం ఉన్నప్పటికీ, భారత్‌లో వెంచర్ క్యాపిటల్ (వీసీ) పెట్టుబడులు 2025లో 16 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.5 లక్షల కోట్ల)కు పెరిగాయి. ఇవి వరుసగా రెండో ఏడాదీ వృద్ధిని నమోదు చేశాయని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ బైన్ అండ్ కంపెనీ వెల్లడించింది. బైన్ అండ్ కంపెనీ, ఇండియన్ వెంచర్ అండ్ ఆల్టర్నేట్ క్యాపిటల్ అసోసియేషన్ (ఐవీసీఏ) సంయుక్తంగా 'ఇండియా వెంచర్ క్యాపిటల్ రిపోర్ట్ 2026'ను విడుదల చేశాయి. దీని ప్రకారం మొత్తం లావాదేవీలు ఏడాది ప్రాతిపదికన 18% పెరిగాయి. వివిధ దశల్లో జరిగిన మొత్తం లావాదేవీల సంఖ్య 1300 దాటాయి. ప్రపంచవ్యాప్తంగా స్థూల ఆర్థిక సవాళ్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కఠినమైన నగదు లభ్యత పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ వృద్ధి నమోదైంది. 50 మిలియన్ డాలర్ల కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీల్లో బలమైన వృద్ధి ఇందుకు దోహదపడింది.

పెద్ద లావాదేవీలు కూడా వేగం పుంజుకున్నాయి. 250 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ కలిగిన లావాదేవీల సంఖ్య నాలుగు నుంచి రెట్టింపై 8కి చేరింది. అనవసర విస్తరణ కంటే.. వ్యాపార నాణ్యత, లాభదాయకతకు ప్రాధాన్యత ఇచ్చే కంపెనీలకే పెట్టుబడిదారులు మొగ్గుచూపారు. కన్జ్యూమర్ టెక్ ఫండింగ్ కొంత తగ్గినా, 2023తో పోలిస్తే ఏడాది ప్రాతిపదికన 25% వృద్ధి దీర్ఘకాలిక స్థిరత్వం కనిపించింది.
ఫిన్‌టెక్ రంగం అద్భుత పనితీరుతో పెట్టుబడుల రికవరీలో కీలక పాత్ర పోషించింది. ఫిన్‌టెక్ లావాదేవీల విలువ ఏడాది ప్రాతిపదికన 2.22 రెట్లు పెరిగాయి. విలువలో చెల్లింపుల విభాగం అతిపెద్ద వాటా కలిగి ఉండగా, డిజిటల్ వినియోగం పెరగడం వల్ల 'వెల్త్‌టెక్' విభాగంలో లావాదేవీల విలువ అయిదు రెట్లు అధికమైంది.
సాఫ్ట్‌వేర్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్‌లలో పెట్టుబడులు 1.5 రెట్లు పెరిగాయి. బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ), జనరేటివ్ ఏఐ ఆధారిత బీ2బీ కంపెనీలు మంచి ఆదరణ దక్కించుకున్నాయి.
2023 తర్వాత భారత వీసీ వ్యవస్థ మళ్లీ వృద్ధి పథంలోకి వచ్చిందని, ఈ సారి స్పష్టమైన పరిణతి కనిపిస్తోందని బైన్ అండ్ కంపెనీ అసోసియేట్ పార్టనర్ ఆదిత్య మురళీధర్ తెలిపారు



# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు సుఖసంతోషాలు కలగాలి

## మాజీ కార్పొరేటర్ చిత్రా సుబ్రమణ్యం



**జవహర్ నగర్, ఏప్రిల్ 5 (నినాదం):** అమ్మలగన్న అమ్మ ఓం శక్తి మరియమ్మ అని అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని మాజీ కార్పొరేటర్ చిత్ర సుబ్రమణ్యం అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ శాంతినగర్ కాలనీలో మరియమ్మ అమ్మవారికి ఆదివారం మాజీ కార్పొరేటర్ చిత్రా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శక్తి మరియమ్మ ( ఓం శక్తి మరియమ్మ) ముక్తి మరియమ్మ (ముక్తి తారం తాయే) అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తమిళనాడులో అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే గ్రామ దేవతగా పేరుగాంచిన ఈ అమ్మవారు వర్షాలు ఆరోగ్యం రక్షణ ప్రసాదించే శక్తి స్వరూపిణి గా భక్తులు విశ్వసిస్తారు అన్నారు. అనంతరం అలిగిరి చిత్ర సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమిళ సోదరులు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతినగర్ ప్రజలంతా అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఘనంగా పట్టభద్రుల వేడుకలు



**అల్వాల్, ఏప్రిల్ 5( నినాదం):** అల్వాల్ నారాయణ పాఠశాలలో విద్యార్థుల పట్ట భద్రత కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రాథమిక విద్యాస్థాయి పూర్తి చేసుకొని ఉన్నత విద్యాస్థాయిలోకి అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వారి ప్రతిభనుప్రదర్శించి, చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అదితిగా యం.ఈ.ఓ మురళీకృష్ణ . ఎ.జి.యం పురుషోత్తం రెడ్డి , ఈ చాంప్స్ ఆర్‌డడి హెడ్ శర్వాణి ,ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ అంబిక,ఈ చాంప్స్ కో ఆర్డినేటర్ దీప్తి ,ప్రధానోపాధ్యాయులు ఉమ ,వైస్ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ హర్షిత, ఎ.డి శైలజ, మరియు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సూరారం లోని అంబేద్కర్ భవన్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ సేవలు దేశానికి అమూల్యమని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి పాత్ర ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సేన నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో ప్రజలు పస్తులుండే రోజులొచ్చే..!

## బిఆర్ఎస్ ప్రగతే తెలంగాణలో సజీవ సాక్ష్యం

## కాంగ్రెస్ ప్రభుత్వంలో తట్టెడు మట్టి ఎత్తిన దాఖలాలు లేవు

## బిఆర్ఎస్ పార్టీలో 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు చేరిక

## మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి





**జవహర్‌నగర్, ఏప్రిల్ 5 (నినాదం):** ప్రజా పాలనలో ప్రజలు పస్తులుండే రోజులు వచ్చాయని బిఆర్ఎస్ చేసిన ప్రగతి తెలంగాణలో సజీవ సాక్ష్యంగా నిలుస్తుందని, కాంగ్రెస్ నాయకులు మాటలు తప్పితే... అభివృద్ధి చేసింది శూన్యమని మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి దుయ్యబట్టారు. ప్రజల కోసం పనిచేసేది బిఆర్ఎస్ పార్టీయే అని జవహర్ నగర్ లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన 50 మంది కార్యకర్తలు మాజీ మేయర్ మేకల కావ్య బిఆర్ఎస్ అధ్యక్షుడు కొండల ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో ఆదివారం బోయిన్పల్లి లోని క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ లో పార్టీ కండువాలు కప్పుకొని చేరారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ యువత సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకటించిన ఉద్యోగాలే కాంగ్రెస్ పాలనలో నియామక పత్రాలు అందజేసిందని విమర్శించారు. ఉమ్మడి పాలనలో తెలంగాణలో కరువు తాండవించేదని బిఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ సారథ్యంతో కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ పచ్చని మణిహారంల మారిందన్నారు. కాంగ్రెస్ పాలనలో తట్టెడు మట్టి ఎత్తిన దాఖలాలు ఎక్కడా లేవని త్వరలోనే బిఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, మహేష్, కృష్ణ యాదవ్, సతీష్ ,దిలీప్, ధనలక్ష్మి, నీకేతన్ గౌడ్, శ్రీకాంత్, రూపేష్, హరి, సన్నీ, నరేంద్ర, వినోద్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**రంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 5 (నినాదం) :** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్ళాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్లోని నాంపల్లిలో జరిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, దురాచారాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. స్వతంత్ర భారతదేశ తొలి దశలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పని చేశారని, తదనంతరం రాజకీయాలలో ఎదుగుతూ కేంద్ర వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా సేవలందించి, ఉప ప్రధానమంత్రిగా దేశానికి కీలక సేవలు అందించారని తెలిపారు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడిగా ఆయనను స్మరించారు. బాబు జగ్జీవన్ రామ్ డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ దళిత వర్గాలకు రిజర్వేషన్ల అమలులో కీలక పాత్ర పోషించారని తెలిపారు కార్మిక, వ్యవసాయ, రక్షణ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశేష సేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కొరకు మనం అందరం కలిసి పని చేయవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామరావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసుల

# హ్యాట్రిక్ విజయం గర్వకారణం



**వికారాబాద్, ఏప్రిల్ 5(నినాదం ):** శాస్త్రీయ నేర పరిశోధనలో తెలంగాణ పోలీసులు మరోసారి దేశానికి మార్గదర్శకులుగా నిలిచారు. మార్చి 29 నుండి ఏప్రిల్ 3 వరకు నాగ్‌పూర్‌లో జరిగిన 69వ అఖిల భారత పోలీస్ విధి సమ్మేళనం ఏ ఐ పి డి ఎం 2025-26లో తెలంగాణ పోలీస్ జట్టు మొత్తం ఛాంపియన్‌షిప్ సాధించి వరుసగా మూడోసారి హ్యాట్రిక్ విజయం నమోదు చేయడం గర్వకారమని ప్రజలు హర్షించారు. జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన తలారి సురేష్ తలారి సురేశ్ సాధించిన కాంస్య పతకాన్ని ఆయన బృందం సాధించింది. విన్నర్ ట్రోపి పోలీస్ వీడియో చిత్రీకరణ విభాగంలో తలారి సురేష్ ప్రదర్శించిన ప్రతిభ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్ర బలగాల నుంచి వచ్చిన 1300 మందికి పైగా సిబ్బందితో పాటు 144 జాగిలాలు పోటీ పడ్డాయి. అంతటి పోటీలో ఈ ఘన విజయం సాధించడం విశేషం. నవాబుపేట్ మండలం లింగంపల్లి గ్రామప్రాంతానికి. గ్రామానికి చెందిన తలారి సురేశ్ పోలీస్ వీడియో చిత్రీకరణ విభాగంలో పతకం సాధించడం పట్ల జిల్లా ప్రజలు అభినందనలు తెలిపారు. తలారి సురేష్ ను తోటి సిబ్బంది కూడా అభినందించారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన కృషి, క్రమశిక్షణతో జాతీయ స్థాయిలో విజయం సాధించడం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. క్రమశిక్షణ, అంకితభావం, ఆధునిక సాంకేతికతపై పట్టు ఉంటే అసాధ్యమైనది ఏదీ లేదని తెలంగాణ పోలీసులు మరోసారి నిరూపించారు. ఈ హ్యాట్రిక్ విజయం తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే కాకుండా నవాబుపేట మండలం లింగంపల్లి గ్రామమానికి కూడా గర్వకారణంగా నిలిచింది. తలారి సురేశ్ సాధించిన విజయం ప్రతి యువకుడికి ప్రేరణగా నిలుస్తోంది. తలారి సురేశ్ ప్రస్తుతం సైబరాబాద్ నందు ఏ ఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు.

# సర్వమతాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం

## ఎమ్మెల్యే జిఎంఆర్

## రూ.36 లక్షలతో గుమ్మటాలకు ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



**పటాన్చెరు, ఏప్రిల్ 05 (నినాదం):** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని సర్వ మతాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడ మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని చారిత్రక గుమ్మటాల పరిరక్షణ కోసం 36 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పురాతన దేవాలయాలు, మసీదుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. సొంత నిధులతో రెండు వందలకు పైగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు నిర్మించడంతోపాటు ప్రతి ఒక్కరిలో పరమతసహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ . ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వి రాజ్, లియాకత్ అలీ, బాబా సెట్, అజ్మత్, వాజీద్ అలీ, హమీద్, ఆషమ్, ఇర్షాద్, ఇమ్రాన్, మొయిన్, చందు, శ్రీ రాములు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## చల్లారం బాలవ్వ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**సిద్దిపేట, ఏప్రిల్ 5 (నినాదం):** తిమ్మాయి పల్లి గ్రామంలోని రెడ్డి కాలనీలో చల్లారం బాలవ్వ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుమారుడు చల్లారం రమ్య సుధాకర్ రెడ్డి ఆదివారం రోజు బాటసారుల దహార్తిని తీర్చడానికి వారి సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేర్యాల రాజు పాల్గొని మాట్లాడుతూ శ్రీ బాలవ్వ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుమారుడు చల్లారం సుధాకర్ రెడ్డి గ్రామంలో చేస్తూ చేస్తున్న సేవలు అభినందనీయమని, చలివేంద్రం ఏర్పాటుతో ఎండాకాలం దృశ్య బాటసారు లకు ఎంతగానో ఉపయోగపడుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారుల సత్తా



## నగదు పురస్కారం అందజేసిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి కొంపల్లి సర్కిల్ పరిధి దూలపల్లి లోని సెంట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాల లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆడిటోరియంలో తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి కరీంనగర్ లో జరిగిన స్టేట్ లెవెల్ లో పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను సన్మానించ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళల, పురుషుల, ఓవరాల్ ఛాంపియన్షిప్ మన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సాధించి అజ్మీర్(రాజస్థాన్)లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పలువురు విజేతలుగా నిలిచారు. ఓవరాల్ ఛాంపియన్షిప్ రన్నరప్ తెలంగాణా రాష్ట్ర ఆధ్వర్యంలో సాధించిన సందర్భంగా ఛాంపియన్షిప్ లో సత్తా చాటిన మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్" సభ్యులకు నగదు పురస్కారం అందజేత కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. జాతీయ, రాష్ట్రస్థాయిలలో సత్తా చాటిన అథ్లెట్స్ విజేతలకు ఎమ్మెల్యే వివేకానంద చేతుల మీదుగా మెమెంటోతో పాటు, నగదు పురస్కారం, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన నిత్యజీవితంలో ఏదో ఒక క్రీడను కొనసాగించినప్పుడు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ పెంపొందు తాయన్నారు. విద్యార్థులు యువత ఖాళీ సమయాలలో తమకిష్టమైన క్రీడలలో రాణించే విధంగా తగిన శిక్షణను పొందుతూ రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయి ఉత్తమ క్రీడాకారులుగా గుర్తింపు సాధించుటకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు మర్రి లక్ష్మణ్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెక్రటరీ డి.లక్ష్మి, ట్రెజరర్ లక్ష్మమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటర్ డాక్టర్ పి జె వి. రత్నా కుమార్, జాయింట్ సెక్రెటర్ నరేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, మాజీ కౌన్సిలర్ దప్పు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



**వికారాబాద్, ఏప్రిల్ 5 (నినాదం):** నవభారత నిర్మాత, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో, గ్రామాల్లో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదిక లల్లో వక్తలు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ విద్యను ఆయుధంగా చేసుకుని అంటరానితనం, కుల వివక్షపై రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. తొలి క్యాబినెట్‌లో అతిచిన్న వయసులోనే ఆయన మంత్రిగా కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో శాసన శభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి, రామ్ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు మెతుకు ఆనంద్, మహేశ్వర్ రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ ఛైర్పర్సన్ అనన్య, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్, పలువురు దళిత నాయకులు, ఆయా పార్టీల నాయకులు, పోలీస్ జిల్లా కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్‌ఐలు నాగరాజు, శ్రీశైలం, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



**కాప్రా, ఏప్రిల్ 5 (నినాదం) :** ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో నాచారం సర్కిల్ శక్తి సాయి నగర్ డివిజన్‌లో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 22 లక్షలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతు ముఖ్యమంత్రి నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రజల అవసరాలను గుర్తించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం అభినందనీయ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు యెల్లేష్ యాదవ్, రాజ్‌కుమార్ యాదవ్, మల్లి యాదవ్, కుమార్ యాదవ్, మధు యాదవ్, వినేష్ యాదవ్ మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కప్పర సాయి కిరణ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, దంతూరి రాజు గౌడ్, కోయిగుర బాలరాజ్ గౌడ్, ఎస్‌వి కిట్టు, వి. శ్రీనివాస్, మనోహర్, పంజాల శ్రీను, జానీ వేణు, నిక్కి గౌడ్, టిల్లూ ముదిరాజ్, జాని భాయ్, విజయ్ రెడ్డి, ఫిరోజ్, అన్వర్, జయంత్ గౌడ్, రింకు, టిల్లూ జమీలా బేగం, శైలజ, సునీత, లావణ్య పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

## నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఈడీ వెంకన్న



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 5 (నినాదం):** భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు టీజీఎస్ఆర్టీసీ ప్రధాన కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యాలయం బస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈడీ సిహెచ్. వెంకన్న, అధికారులు, సిబ్బంది బాబుజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఈడీ సిహెచ్. వెంకన్న మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన ధీశాలి బాబూ జగ్జీవన్ రామ్ అని, సామాజిక సమానత్వానికి ఆయనే పునాది వేశారని కొనియాడారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన బాబుజీ, నాటి కాలంలో ఉన్న అస్పృశ్యత, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను విద్యార్థి దశ నుంచే ధైర్యంగా ఎదుర్కొని జనంలో చైతన్యం తెచ్చిన గొప్ప సంఘ సంస్కర్త అని వారు గుర్తుచేశారు. కేవలం నిరసన తెలపడమే కాకుండా, అధికారంలోకి వచ్చి వ్యవస్థను మార్చాలని నమ్మిన ఆయన, ఐదు దశాబ్దాల పాటు పార్లమెంటేరియన్ గా చట్టసభల్లో తన ప్రత్యేక ముద్ర వేశారని ఈడి వెంకన్న తెలిపారు. దేశాభివృద్ధి అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు, సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సమాన గౌరవం, అవకాశం లభించడమేనని నమ్మిన బాబుజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని వెంకన్న వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ఎందరికో ఆదర్శంగా నిలిచాయని, ఆ మహనీయుడి స్ఫూర్తితోనే టీజీఎస్ఆర్టీసీ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ఆర్టిసి ఫైనాన్షియల్ అడ్వైజర్ విజయపుష్ప, సీటీఎం (ఎం, సి ) శ్రీధర్, సీసీఈ కవిత, పలువురు సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్మృతికి అంజలి ఘటించారు.

# హామీలు అమలు చేయడం అభినందనీయం

## • ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, ఏప్రిల్ 5(నినాదం):** మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని గెలిచిన వెంటనే అమలు చేయడం అభినందనీయమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డ్ కౌన్సిలర్ సుల్తాన్పురం ఈశ్వరమ్మ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఏర్పాటు చేసిన రెండు రూపాయలకే మినరల్ వాటర్ ప్లాంట్ ను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఆయన మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ప్రజలు ఎంతో నమ్మకంతో బిఆర్ఎస్ పార్టీకి అధికారం అందించారని.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అతి త్వరలో మున్సిపల్ పరిధిలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమైనట్లు తెలిపారు. ప్రతి వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి. ఆయా వార్డుల కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు స్ఫూర్తిదాయకం



**అల్వాల్, ఏప్రిల్ 5 (నినాదం):** బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబు జగజీవన్ రావ్ జయంతివేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా భూదేవి నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరంమజ్జిగ. నిమ్మరసం. కంపెనీ చేశారు ఈ కార్యక్రమంలో రాజు ,రమేష్, అరవింద్, సురేష్, మునిరాజ్, మారన్, శేఖర్,రామానుజన్,అరుణ్ కుమార్, అశోక్, సురేష్, పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టు కొత్త ప్రాంగణం దేశానికే గర్వకారణం

**సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**
**రాజేంద్రనగర్‌లో హైకోర్టు జోన్- పనులకు శంకుస్థాపన**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి భూమి పూజ చేసిన సీజేఐ**
**2,500 కోట్లతో 100 ఎకరాల్లో అత్యాధునిక 'న్యాయ దేవాలయం'**





**రాజేంద్రనగర్, ఏప్రిల్5 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర కీర్తి కిరీటంలో మరో మణిహారంగా నిలిచే నూతన హైకోర్టు భవన నిర్మాణ దిశగా కీలక అడుగు పడింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రన గర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయ మూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో కలిసి హైకోర్టు జోన్- భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**సంస్థాగత స్వయం సమృద్ధికి ప్రతీక : సీజేఐ**
శంకుస్థాపన అనంతరం హైకోర్టు భవన నమూనాను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రాంగణం దేశంలోనే అత్యుత్తమ హైకోర్టుగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమగ్ర సముదాయం: కోర్టు గదులు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్స్, ఆర్కైవ్స్, నివాస వసతులు అన్నీ ఒకే చోట ఉండటం వల్ల పనితీరు మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి: జిల్లా న్యాయవ్యవస్థ కోసం శిక్షణా కార్యక్రమాలు, ప్రజల కోసం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించేలా ఆడిటోరియం రూపొందించడం అభినందనీయమన్నారు.

**రికార్డుల భద్రత :** "సంస్థాగత స్మృతి అనేది విలాసం కాదు, అది న్యాయ స్థిరత్వానికి పునాది" అని పేర్కొంటూ, మూడు అంతస్తుల సెంట్రల్ రికార్డ్ రూమ్ ప్రాధాన్యతను వివరించారు.

**వందేళ్ల అవసరాల కోసం 'న్యాయ దేవాలయం' :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సామాన్య పౌరుడికి చివరి ఆశ్రయమైన కోర్టును 'న్యాయ దేవాలయం'గా తీర్చిదిద్దుతున్నట్లు ప్రకటించారు. చారిత్రాత్మక నిర్ణయం: ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 100 ఎకరాల భూమిని కేటాయించి, రూ. 2,500 కోట్లు మంజూరు చేయడం ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. గడువులోగా పూర్తి: ఇప్పటికే జోన్- పనులు వేగంగా జరుగుతున్నాయని, నేడు శంకుస్థాపన చేసిన జోన్- పనులను డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 49 కోర్టుల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే తమ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఎస్.వి. భట్టి, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఆర్‌డబి సెక్రెటరీ వికాస్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.జి. కర్ణన్, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ ఆర్ డి ఓ వెంకటరెడ్డి, తాసిల్దార్ రాములు, ఇతర ఉన్నతాధికారులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కలెక్టరేట్లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**బాబు జగ్జీవన్ రామ్ ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్**



**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 5, (నినాదం):** భారత దేశ మాజీ ఉప ప్రధాని, సమతా వాది బాబు జగ్జీవన్ రామ్ ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. దేశ రాజకీయ రంగంలో అర్ధ శతాబ్దానికి అగ్రశ్రేణి నేతగా శాసనసభ్యత్వంతో మొదలుకొని దేశ ఉప ప్రధాని వరకు ఎన్నో పదవులను బాబు జగ్జీవన్ రామ్ పొందారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలను షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో మొదటి న్యాయ శాఖ, కార్మిక శాఖ మంత్రిగా బాబు జగ్జీవన్ రామ్ చేసిన సంస్కరణలు అనిర్వచనీయం అన్నారు. ఆయన జయంతిని సమతా దినంగా నిర్వహించుకుంటామని చెప్పారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీధి దీపాల కింద కూర్చుని చదువుకున్న వారు మహానుభావులు అయ్యారని తెలిపారు. తాను ఇక్కడికి కొత్తగా వచ్చానని, జిల్లాలోని అన్ని వసతి గృహాలను సందర్శిస్తాననీ అన్నారు. విద్యతోనే తనకు కలెక్టర్ గా గుర్తింపు, గౌరవం వచ్చాయని, మనం అనుకుంటే ఏదైనా సాధించ వచ్చని, విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు నిరంతర కృషి చేయాలని సూచించారు. ఇష్టంతో నేర్చుకున్నది శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. వసతి గృహాలలో ప్రతీ వారం విద్యార్థులకు సందేశాత్మక సినిమాలను చూపించాలని, మూవీ క్లబ్ ను అన్ని వసతి గృహాలలో అమలు చేయాలన్నారు. అనంతరం వసతి గృహాల విద్యార్థినిలతో బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్ర గురించి ఉపన్యాసం చెప్పించారు. విద్యార్థిని లను అభినందించి వారికి రాత పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీధర్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్, డీపీ ఆర్ వో రషీద్, కౌన్సిలర్లు మహేష్, రాజేష్, భరత్, ఏ ఎస్ డబ్లు ఓ పరమేశ్, సింగిల్ విండో డైరెక్టర్ సంక్లాపురం మల్లేష్, దళిత సంఘాల నాయకులు మొచ్చ శరణప్ప, సూర్యకాంత్, పరిగి రమేష్ ఈశ్వరమ్మ, మహదేవ్, ఎస్సీ వసతి గృహాల వార్డెన్లు, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నృసింహుని దర్శించుకున్న ప్రోగ్రెసివ్ మీడియా సీఈవో మోహన్



**ధర్మపురి మార్చి5( నినాదం) :**
ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని ఆదివారం ఉదయం ప్రోగ్రెసివ్ మీడియా సంస్థ సీఈవో మోహన్ దంపతులు దర్శించుకున్నారు. ప్రధాన ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనం తరం ఆలయ అర్చకులు స్వామి వారి శేషవస్త్ర ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఈవో మోహన్ మాట్లాడు తూ నవనారసింహ క్షేత్రాలలో ఒకటైన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, ప్రతీ ఒక్కరు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు.

## కరీంనగర్‌లో మేయర్ క్యాంపు
# కార్యాలయం ఘన ప్రారంభం

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం అభివృద్ధికి కట్టుబాటు అని హామీ**



**కరీంనగర్, ఏప్రిల్ 5(నినాదం) :** కరీంనగర్ నగరంలోని తీగలగుట్టపల్లిలో నూతన మేయర్ క్యాంపు కార్యాలయం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికి గజమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మేయర్‌కు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు టపాసులు కాల్చి సంబరాలు జరుపగా, ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, క్యాంపు కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి వేదికగా పనిచేస్తుందని తెలిపారు. నగర అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందని అన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, తనకు లభించిన బాధ్యతను నమ్మకంగా నిర్వహిస్తానని, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. నగరంలోని విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నృసింహుని దర్శించుకున్న
# న్యాయమూర్తులు

**ధర్మపురి ఏప్రిల్ 5( నినాదం ) :** ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని ఆదివారం ఉదయం సిద్దిపేటకు చెందిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి సాయిరామా దేవి దంపతులు, అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వై. జయప్రసాద్ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి దేవస్థాన సాంప్రదాయం ప్రకారం మేళతాళాలతో అర్చకులు సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి న్యాయమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జిల దంపతులకు వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు అందజేయగా దేవస్థాన సూపరింటెండెంట్ కిరణ్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, ఇతర అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## కాళ్ల నరాల వ్యాధులపై అవగాహన 'వ్యాస్క్యులార్ సర్జన్స్' క్రికెట్ లీగ్



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 5 (నినాదం):** మారుతున్న జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ సినీ నటుడు రాజీవ్ కనకాల పిలుపునిచ్చారు. ఆదివారం మణికొండలోని 'లేక్‌సైడ్ లీగ్ స్పోర్ట్స్ క్యాఫే' వేదికగా తెలంగాణ సొసైటీ ఆఫ్ వాస్క్యులార్ అండ్ ఎండోవ్యాస్క్యులార్ సర్జన్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం, ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. డీప్ వీన్ థ్రాంబోసిస్ పై హెచ్చరిక ముఖ్యంగా కాళ్ల నరాల్లో రక్తం గడ్డకట్టడం, అది ఊపిరితిత్తులకు పాకడం వంటి తీవ్రమైన సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నగరవ్యాప్తంగా ఉన్న ప్రముఖ వాస్క్యులార్ సర్జన్లు ఈ లీగ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజీవ్ కనకాల వైద్యులతో కలిసి క్రికెట్ ఆడి సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఆరోగ్యమే మహా భాగ్యం. శారీరక వ్యాయామం ప్రతిరోజూ అలవాటు చేసుకోవాలి. కాళ్లల్లో వాపులు వచ్చినా, నరాల్లో సమస్యలు ఉన్నా నిర్లక్ష్యం చేయకూడదు. డివిటి వంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స సులువవుతుంది, లేదంటే కాళ్లను కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుందని ఆయన అన్నారు. వైద్యుల సూచనలు కాళ్లలో వాపులు కనిపించినా లేదా రక్తప్రసరణలో ఇబ్బందులు ఉన్నా వెంటనే నిపుణులైన వాస్క్యులార్ సర్జన్లను సంప్రదించాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డా. పంజాల రామకృష్ణ, డా. ప్రేమ్ చంద్ గుప్తా, డా. నిషాన్ రెడ్డి, డా. దేవేందర్ సింగ్, డా. వసంత్ రెడ్డి, డా. జ్ఞానేశ్వర్డా. నీహార్ రంజన్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ఫ్రెండ్లీ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు రాజీవ్ కనకాల చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. క్రీడల ద్వారా ఆరోగ్య సందేశాన్ని అందించిన వైద్యుల చొరవను పలువురు అభినందించారు.

N NADAM CINEMA

## 'స్పిరిట్'లో ప్రభాస్ ఊచకోత ఖాయం : అనంత శ్రీరామ్



ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని హీరో ప్రభాస్ నటిస్తున్న 'స్పిరిట్' చిత్రానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'స్పిరిట్' సినిమా షూటింగ్ ప్రస్తుతం వేగంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే ఈ చిత్రానికి తాను రెండు పాటలు రాసినట్లు, మరో పాటకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సినిమా ఆల్బమ్ గురించి మాట్లాడుతూ, ప్రేక్షకులు ఒక మంచి క్లాసిక్ టచ్ ఉన్న పాటలను వినబోతున్నారని అన్నారు. దీంతో ప్రభాస్ వంటి మాస్ హీరో సినిమాలో క్లాసిక్ ఆల్బమ్ ఎలా ఉంటుందనే ప్రశ్న ఎదురవగా, సినిమా మొత్తం క్లాసిక్ శైలిలో ఉండదని, అయితే పాటలు మాత్రం ప్రత్యేకమైన క్లాస్ టచ్‌తో కుదిరాయని అనంత శ్రీరామ్ స్పష్టం చేశారు. అదే సమయంలో 'స్పిరిట్' సినిమాలో ప్రేక్షకులకు కావలసినంత యాక్షన్, ఊచకోత సన్నివేశాలు కూడా ఉంటాయని తెలిపారు. అనంత శ్రీరామ్ చేసిన వ్యాఖ్యల ప్రకారం, ఈ చిత్రంలోని పాటలు క్లాస్ టచ్‌లో ఉండగా, ప్రభాస్ పాత్ర మాత్రం పూర్తి స్థాయిలో మాస్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 'స్పిరిట్' చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తుండగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నారు. టి-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్, ప్రభాకర్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# న్యూడ్ ఏఐ చిత్రాలతో నరకం చూస్తున్నా..

**జాన్వీ కపూర్ ఎమోషనల్ కామెంట్స్**



బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ తన టీనేజ్ రోజుల్లో ఎదురైన ఒక చేదు జ్ఞాపకాన్ని పంచుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఒక పోర్న్ సైట్‌లో తన మార్ఫింగ్ ఫోటోను చూసి షాక్ అయ్యానని, ఆ చేదు అనుభవం తనను ఇప్పటికీ వెంటాడుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జాన్వీ, సోషల్ మీడియాలో సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న చీకటి కోణాన్ని బయటపెట్టింది. "అది డీప్‌ఫేక్ ఫోటోనో లేక మరేదో నాకు తెలియదు కానీ, ఒక పోర్న్ సైట్‌లో నా ఫోటో కనిపించింది. అప్పుడు నేను స్కూల్ చదువుతున్నాను. మా ఐటీ క్లాసులో అబ్బాయిలు సరదా కోసం కొన్ని సైట్లు ఓపెన్ చేసేవారు. అలా చూస్తున్నప్పుడు నా ఫోటోలు అక్కడ ఉండటం చూసి చాలా ఇబ్బందిగా అనిపించింది. అప్పట్లో సెలబ్రిటీగా పుట్టినందుకు మనం చెల్లించాల్సిన మూల్యం ఇదేనేమో అని నా మనసును నేనే సర్దిచెప్పుకున్నాను" అని చెప్పుకొచ్చింది. ఆ వయసులో అది తనపై తీవ్ర ప్రభావం చూపిందని ఆమె గుర్తుచేసుకుంది. అయితే, ఇప్పుడు టెక్నాలజీ పెరిగిన తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపంలో ఈ వేధింపులు మరింత ఎక్కువయ్యాయని జాన్వీ వాపోయింది. "ప్రస్తుతం ఏఐ చిత్రాల వల్ల నేను అస్సలు ప్రశాంతంగా లేను. నేను ఎప్పుడూ వేసుకోని బట్టలు, నేను ఎప్పుడూ ఇవ్వని పోజులతో నా ఫోటోలను సృష్టిస్తున్నారు. విచారకరమైన విషయం ఏంటంటే, కొన్ని అఫీషియల్ న్యూస్ పేజీలు కూడా ఆ ఏఐ చిత్రాలను నిజమని నమ్మి షేర్ చేస్తున్నాయి. ఇది నన్ను ఎంతగానో కలచివేస్తోంది" అని తన ఆవేదనను వెళ్లగక్కింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. సనా దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన జాన్వీ రొమాన్స్ చేయనుంది.

# చిరుతో ఫ్లైట్ జర్నీ ఒక మధురానుభూతి

ఈటీవీలో ప్రసారం అయిన జబర్దస్త్ కామెడీ షో ద్వారా గెటప్ శ్రీను మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. ఈ షోలో చాలా కాలం పాటు పనిచేసిన ఈయన ఎంతోమంది బుల్లితెర అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత ఈ నటుడు సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి అనేక చిత్రాల్లో నటించి తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాడు. తాజాగా శ్రీను, మెగాస్టార్ చిరంజీవితో పాటు ఫ్లైట్లో ప్రయాణిస్తున్న ఓ ఫోటో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. తాజాగా శ్రీను ఈ ఫోటో గురించి స్పందిస్తూ చాలా ఎమోషనల్ అయ్యాడు. నా చిన్నతనంలో ఊర్లో ఆకాశం నుండి విమానం వెళుతుందంటే చాలు చిరంజీవి అందులో వెళుతున్నాడని చిరంజీవి, చిరంజీవి అని అరిచేవాళ్ళం. అలాంటి నేను చాలా సంవత్సరాల తర్వాత చిరంజీవి గారితో కలిసి ఫ్లైట్లో జర్నీ చేశాను. ఇదే విషయాన్ని మా ఇంట్లో వాళ్లకు ఫోన్ చేసి చెప్పాను. నేను ఈ విషయం చెప్పి ఎమోషనల్ కావడంతో వాళ్ళు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. దాంతో ఆ రోజు చాలు, ఇక మనం హైదరాబాద్ వచ్చిన పని అయిపో యింది అని అనుకున్నట్లు శ్రీను చెప్పుకొచ్చాడు. ఈయన చిరంజీవి తో కూడా పలు చిత్రాల్లో నటించాడు. తాజాగా ఈ నటుడు సంగీత్ శోభన్ హీరోగా, నయన్ సారిక హీరోయిన్గా నిహారిక నిర్మా ణంలో రూపొందిన రాకాస చిత్రం లో కీలక పాత్రలో నటించాడు. ఈ మూవీ ఏప్రిల్ 3న విడుదలై ప్రస్తుతం థియేటర్లలో విజ యవంతంగా ప్రదర్శించబడుతుంది.



## చాలా మంది పెద్ద మేకర్స్
# నన్ను సంప్రదిస్తున్నారు

**మృణాల్ ఠాకూర్.. షాకింగ్ కామెంట్స్**



టాలీవుడ్ గోల్డెన్ లెగ్ మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతోంది. 'సీతారామం'లో సీత మహాలక్ష్మిగా, 'హాయ్ నాన్న'లో యష్ణగా తన నటనతో అందరినీ మాయ చేసిన ఈ బ్యూటీ, ఇప్పుడు తన కెరీర్ విషయంలో చాలా కఠినమైన నిర్ణయాలు తీసుకుం టోంది. తాజాగా అడివి శేష్‌తో కలిసి నటిస్తున్న 'డెకాయిట్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న మృణాల్, తను పెద్ద సినిమాలను ఎందుకు వదులుకుంటుందో క్లారిటీ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ వేడుకలో మృణాల్ మాట్లాడుతూ.. "చాలా మంది పెద్ద మేకర్స్ నన్ను సంప్రదిస్తున్నారు. వారు ఇచ్చే ప్యాకేజీలు, రెమ్యునరేషన్ చూస్తే నిజంగా చాలా టెంప్టింగ్ గా ఉంటుంది. కానీ, భారమైన హృదయంతో నేను వాటిని కాదనాల్సి వస్తోంది. ఎందుకంటే సీత మహాలక్ష్మి, యష్ణ వంటి పాత్రలు నా కెరీర్‌లో ఒక బెంచ్‌మార్క్ సెట్ చేశాయి. ఆ స్థాయిని తగ్గించేలా ఉండే ఏ సినిమాను నేను చేయదలచుకోలేదు. దురాశ దుఃఖానికి చేటు అని నేను నమ్ముతాను. అందుకే ఎంత పెద్ద ఆఫర్ వచ్చినా, కథ సరిగ్గా లేకపోతే 'సర్.. నేను మంచి సినిమా కోసం వెయిట్ చేస్తాను' అని చెప్పేస్తున్నాను" అంటూ తన మనసులో మాట బయటపెట్టింది. ఇక 'డెకాయిట్' ట్రైలర్ విషయానికి వస్తే, అడివి శేష్ తన మార్క్ యాక్షన్ తో అదరగొట్టేశాడు. అన్యాయంగా జైలుకు వెళ్లిన హీరో, తనను మోసం చేసిన మహిళపై ప్రతీకారం తీర్చుకోవడానికి తిరిగి రావడం ఈ సినిమా మెయిన్ పాయింట్. తన జీవితాన్ని నాశనం చేసిన ఆ మగువపై పగ తీర్చుకోవాలా? లేక ఆమెను, ఆమె భర్తను ప్రమాదం నుంచి కాపాడాలా? అనే సందిగ్ధంలో సాగే ఈ డ్రామా ప్రేక్షకుల్లో విపరీతమైన క్యూరియాసిటీని పెంచుతోంది. ఈ ట్రైలర్ చూసిన మహేష్ బాబు, విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వంటి స్టార్స్ సోషల్ మీడియా వేదికగా టీమ్‌ను అభినందిస్తున్నారు. మొత్తానికి ఏప్రిల్ 10న బాక్సాఫీస్ వద్ద 'డెకాయిట్' సునామీ ఖాయంగా కనిపిస్తోంది.

## సినిమా అంటే శర్వానంద్‌కు ఇంత పిచ్చా...

**వెండితెరకు సాష్టాంగ నమస్కారం**



సినిమా ఇండస్ట్రీలో పెద్ద స్టార్ హీరో దగ్గర నుండి చిన్న టెక్నీషియన్ వరకు అందరూ కూడా దాదాపుగా సినిమా పట్ల తమ అభిమానాన్ని ఎప్పుడో ఒకప్పుడు చూపిస్తూ ఉంటారు. కానీ కొంతమంది మాత్రం సినిమాపై తమకున్న పిచ్చిని అప్పుడప్పుడు నిరూపించుకుంటూ ఉంటారు. తెలుగు సినిమా పరిశ్రమలో మంచి క్రేజ్ కలిగిన హీరోలలో శర్వానంద్ ఒకరు. ఈయనకు సినిమా అన్నా, సినిమా పరిశ్రమ అన్నా ఎంతో ఇష్టం. దీనిని పలు సందర్భాలలో ఆయన బయటపెట్టారు. ఇక మరోసారి సినిమా అంటే ఆయనకు ఎంత పిచ్చి అనేది రుజువైంది. తాజాగా శర్వానంద్ నటించిన బైకర్ చిత్రం ఏప్రిల్ 3న విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ సినిమా విజయవంతంగా థియేటర్లలో ప్రదర్శించబడుతుంది. దాంతో శర్వానంద్ చాలా థియేటర్లను సందర్శిస్తున్నాడు. అందులో భాగంగా ఈరోజు శ్రీరాములు థియేటర్ కి వచ్చాడు. థియేటర్ స్క్రీన్ వద్ద సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆ తర్వాత స్క్రీన్ ను ముట్టి దానిని మొక్కాడు.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787